



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 1 సంచిక : 269 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం బుధవారం 5 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 269 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM WED 5 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## నిరుద్యోగ సంక్షోభం.. మోదీ సర్కార్‌కు పెనుసవాల్.. బీబీసీ ప్రత్యేక కథనం!



- పరీక్ష పత్రాల లీక్‌పై యువత ఆగ్రహం.. కేంద్ర మంత్రి రాజీనామా
- దేశంలో తీవ్రమవుతున్న నిరుద్యోగ సంక్షోభంపై నిపుణుల ఆందోళన
- విద్యా వ్యవస్థ వైఫల్యం, పడిపోతున్న ఉపాధి అవకాశాలు

- మిగతా 2లో

## జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన రేపల్లె నియోజకవర్గం టీడీపీ నేత



- రేపల్లె నియోజకవర్గంలో ఆసక్తికర పరిణామం
- వైసీపీలో చేరిన టీడీపీ నేత గూడపాటి శ్రీనివాసరావు
- గూడపాటిని పార్టీలోకి హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నామన్న జగన్

- మిగతా 2లో

## సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం.. ప్రముఖ నటుడు ప్రదీప్ రావత్ మృతి

పెన్ పవర్ డెస్క్:సై, గజినీ, ఛత్రపతి మొదలైన బ్లాక్ బస్టర్ సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ప్రముఖ నటుడు ప్రదీప్ రావత్ కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం



- మిగతా 2లో

# వాళ్లది విధ్వంసం, మాది పునర్నిర్మాణం..

### రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేసిన చంద్రబాబు




- గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం రూ.9.74 లక్షల కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోయిందని సీఎం.
- రెండేళ్లలో రూ.1.49 లక్షల కోట్ల సంక్షేమం, రూ.30,607 ప్రభుత్వ ఉద్యోగాలు అందించామని వెల్లడి.
- అమరావతి, పోలవరం పూర్తి చేసి తీరతామని స్పష్టం.
- విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా ట్రిపుల్ ఇంజన్ గ్రోత్ వ్యూహం.
- సంక్షేమం ఆగదు.. అభివృద్ధి ఆగదని చంద్రబాబు.

- మిగతా 2లో

| ఆర్థిక గణాంకాలు | రెండేళ్లలో సంక్షేమం | ఉద్యోగాల కల్పన |
|---|---|---|
| మొత్తం అప్పులు రూ. 9.74 లక్షల కోట్లు | రూ. 1,49,401 కోట్లు | 30,607 ప్రభుత్వ ఉద్యోగాలు |

**దిద్దుబాటు చర్యలు**

- పెండింగ్ బిల్లుల్లో రూ.29,000 కోట్లకు పైగా చెల్లింపు.
- ఉద్యోగుల బకాయిలు రూ.30,849 కోట్లు క్లియర్.
- రీ-నెగోషియేషన్ ద్వారా రూ.8,269 కోట్ల ఆదా.
- 86 కేంద్ర ప్రాయోజిత పథకాల పునరుద్ధరణ.
- రూ.29,890 కోట్ల కేంద్ర నిధుల సమీకరణ

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిపై ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం నాడు శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనను “విధ్వంసం”గా అభివర్ణిస్తూ, తమ ఎన్డీయే ప్రభుత్వం చేపడుతున్నది “పునర్నిర్మాణం” అని స్పష్టం చేశారు. 2019 నుంచి 2024 మధ్య కాలంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా నాశనం చేశారని, సంస్థలను నిర్వీర్యం చేసి, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన గత రెండేళ్లలో చేపట్టిన దిద్దుబాటు చర్యలు, భవిష్యత్ ప్రణాళికలను ఆయన సమగ్రంగా వివరించారు.

**గత ఐదేళ్లది విధ్వంసం.. మాది పునర్నిర్మాణం**

2024 ఎన్నికల్లో ప్రజలు చారిత్రక తీర్పు ఇచ్చారని, ఇది ఒక నిశ్శబ్ద విప్లవం అని చంద్రబాబు అభివర్ణించారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో భయంకరమైన పరిస్థితులు నెలకొన్నాయని, స్వేచ్ఛగా మాట్లాడే పరిస్థితి కూడా లేదని అన్నారు. ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంస పాలన ప్రారంభమైందని, అమరావతిని ఆపేసి, పోలవరాన్ని నిర్వీర్యం చేసి, పారిశ్రామికవేత్తలను తరిమికొట్టి “బ్రాండ్ ఆంధ్రప్రదేశ్”ను పూర్తిగా దెబ్బతీశారని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చాక ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సహకారంతో రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టేందుకు అనునిత్యం శ్రమిస్తున్నామని తెలిపారు.



## నైతిక విలువలతోనే సంపూర్ణ విద్యా వికాసం

### మంత్రి లోకేశ్‌తో చాగంటి కోటేశ్వరరావు

- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో చాగంటి కోటేశ్వరరావు భేటీ
- నైతిక విలువలతో కూడిన విద్య ఆవశ్యకతపై కీలక చర్చ
- విద్యార్థులను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ప్రభుత్వ పాఠశాలల్లో నైతిక విలువల బోధనపై సమీక్ష

- మిగతా 2లో

## రెండున్నరేళ్లలోనే ఆంధ్రప్రదేశ్‌కు రూ.19,619 కోట్లు

### లోక్‌సభలో కేంద్రం వెల్లడి

- గత రెండున్నరేళ్లలో ఏపీకి ప్రత్యేక సాయం
- గత వైసీపీ ప్రభుత్వం కంటే అధికంగా నిధులు సాధించిన కూటమి ప్రభుత్వం
- లోక్‌సభలో వైసీపీ ఎంపీ ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ అధికారిక సమాధానం
- ఆర్థిక క్రమశిక్షణ, సమర్థవంతమైన అమలు వల్లే ఇది సాధ్యమైందన్న రాష్ట్ర ప్రభుత్వం
- మూలధన వ్యయం కోసం కేంద్రం 50 ఏళ్లకు వడ్డీలేని రుణాలు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి భారీగా ఆర్థిక చేయూత లభించింది. “రాష్ట్రాలకు మూలధన పెట్టుబడుల కోసం ప్రత్యేక సహాయ పథకం” (ఎస్ఏఎస్‌సీఐ) కింద గత రెండున్నరేళ్ల కాలంలోనే రాష్ట్రానికి రూ.19,619 కోట్లు అందాయని కేంద్ర



- మిగతా 2లో

## విద్యుత్ ఛార్జీలు పెంచలేదు, ట్రూడౌన్ చేశాం

- అస్తవ్యస్తమైన విద్యుత్ రంగాన్ని గాడిలో పెట్టామన్న మంత్రి గొట్టిపాటి
- ఛార్జీలు పెంచకుండా ట్రూడౌన్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని వెల్లడి
- పీఎం సూర్య ఘర్ పథకాన్ని రాష్ట్రంలో పూర్తిగా అమలు చేస్తామని స్పష్టం
- జగన్ హయాంలో అన్ని వ్యవస్థలు నాశనమయ్యాయని విమర్శ
- రాష్ట్రవ్యాప్తంగా కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం వేగవంతం చేశామని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా మారిన విద్యుత్ రంగాన్ని తిరిగి గాడిలో పెట్టామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. మంగళవారం నాడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు పెంచకుండా 'ట్రూ డౌన్' చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు. విద్యుత్ శాఖలో సాధించిన ప్రగతిపై శ్వేతపత్రం విడుదల చేశామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. “ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో వ్యవస్థలను చక్కదిద్దేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నాం. జగన్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలూ సర్వనాశనం అయ్యాయి. మేము వాటిని బాగుచేస్తున్నాం” అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పీఎం సూర్య ఘర్' పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లో పూర్తిగా వినియోగించుకుని,

- మిగతా 2లో



### ఆలస్యం చేస్తే చాలా కష్టం.. జనన మరణాల నమోదుకు కొత్త రూల్స్..

## పార్లమెంట్‌లో బిల్లుకు ఆమోదం!

- ఆలస్యంగా చేసే రిజిస్ట్రేషన్లకు కఠినమైన నిబంధనలు
- రెండేళ్లు దాటితే జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు అవసరం
- దేశంలో 99 శాతానికి పైగా పెరిగిన జనన, మరణాల నమోదు
- గుర్తింపు మోసాలను అరికట్టడమే లక్ష్యమని తెలిపిన కేంద్రం

పెన్ పవర్ డెస్క్:దేశంలో జనన మరణాల నమోదు ప్రక్రియను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కీలక బిల్లుకు పార్లమెంట్ ఆమోద ముద్ర వేసింది. జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు-2026కు మంగళవారం రాజ్యసభ ఆమోదం తెలిపింది.

- మిగతా 2లో



## ఏ నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే బాస్



- తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు
- 7 పేజీలతో నివేదికను పీసీసీ చీఫ్ కు అందించిన జగ్గారెడ్డి
- అందరి నుంచి అభిప్రాయాలను సేకరించి నివేదికను తయారు చేశామన్న జగ్గారెడ్డి

- మిగతా 2లో

## అహంకారం వినాశనానికి దారితీస్తుంది

### విజయ్ ప్రభుత్వంపై స్టాలిన్ తీవ్ర ఆగ్రహం



- త్రిషపై వ్యాఖ్యల కేసులో ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్, విడుదల
- అధికార టీవీకే అహంకారంతో వ్యవహరిస్తోందన్న ఎంకే స్టాలిన్
- ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టి మరల్చేందుకే ఈ చర్యలని ఆరోపణ

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# విడదల యాక్టివ్ అవ్వడానికి కారణమదేనటగా?

వైసీపీ నేత విడదల రజని మళ్లీ చిలకలూరి పేట నియోజకవర్గంలో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. వైసీపీ నుంచి తిరిగి చిలకలూరి పేట నియోజకవర్గం నుంచి గెలిచేందుకు ఆమె ఉవ్విళ్లూరుతున్నారు. చిలకలూరి పేట నియోజకవర్గంలో జరిగే వైసీపీ కార్యక్రమాల్లో విరివిగా పాల్గొంటూ తిరిగి నియోజకవర్గంలో తన పట్టును నిలుపుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వైసీపీ నాయకత్వం కూడా చిలకలూరి పేట ఇన్ ఛార్జిగా విడదల రజనిని నియమించడంతో ఆమె మరొకసారి గెలిచి తన సత్తా చూపాలని చూస్తున్నారు. ఇటీవల జరిగిన వెన్నుపోటు కు రెండేళ్లు కార్యక్రమాన్ని కూడా విజయవంతంగా నిర్వహించినట్లు పార్టీ నాయకత్వానికి నివేదికలు అందాయి.

విడదల రజిని 2014లో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు శిష్యురాలిగా తెలుగుదేశం పార్టీలో చేరి రాజకీయాల్లోకి వచ్చారు. విఆర్ ఫౌండేషన్ స్థాపించి నియోజకవర్గంలో సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు.2019 ఎన్నికల్లో చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశించారు. టీడీపీ నుండి ప్రత్తిపాటి పుల్లారావు అక్కడ పోటీ చేస్తుండడంతో 2018లో వైసీపీలో చేరారు. ఆమె 2019 ఎన్నికల్లో చిలకలూరి పేట నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి టీడీపీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు పై 8301 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2022 ఏప్రిల్ 11న జరిగిన మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణలో భాగంగా జగన్ మంత్రివర్గంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.విడదల రజిని 2024లో జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలలో గుంటూరు పశ్చిమ నుండి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి టీడీపీ అభ్యర్థి గళ్ళా మాధవి చేతిలో 51150 ఓట్ల తేడాతో ఓడిపోయారు.

సామాజికవర్గం పరంగా... విడదల రజని ఆర్థికంగా బలమైననేత. సామాజికవర్గం పరంగా కూడా ఆమెకు కలసి వచ్చే అంశమే. భర్త కాపు సామాజికవర్గం కావడం కూడా ఆమెకు రాజకీయంగా కలసి వస్తుందని అంటున్నారు. విడదల రజని కుటుంబం విదేశాల్లో వ్యాపారాలు చేసి బాగానే సంపాదించారు. ఆమెతో పాటు ఆమె కుటుంబ సభ్యులపై వరసగా కేసులు కూడా నమోదు అవుతుండటం విడదల రజనిపై సానుభూతి పెరిగిందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. బీసీ ం కాపు సామాజికవర్గం కలగలిపి ఉండటంతో ఖచ్చితంగా గెలుపు గుర్రం ఎక్కుతారని వైసీపీ నాయకత్వం కూడా అంచనా వేస్తుంది. విడదల రజనికి పార్టీ నాయకత్వం అండగా కూడా పుష్కలంగా ఉండటంతో ఈసారి చిలకలూరి పేట నుంచి పోటీ చేయడం ఖాయమని పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. అక్కడ బలమైన నేతగా విడదల రజని ముద్ర పడ్డారు.

# నైతిక విలువలతోనే సంపూర్ణ విద్యా వికాసం

ప్రముఖ ప్రవచనకర్త, నైతిక విలువల సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు మంగళవారం రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఉండవల్లిలోని మంత్రి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో.. విద్యా వ్యవస్థలో నైతిక విలువల ప్రాముఖ్యత, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే అంశాలపై వీరిద్దరి మధ్య కీలక చర్చ జరిగింది.ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులను సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దాలంటే నైతిక విలువలతో కూడిన విద్య అందించడం ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు. చిన్నతనం నుంచే పిల్లల్లో మానవతా విలువలు, క్రమశిక్షణ, నైతికత వంటి గుణాలను పెంపొందించాల్సిన అవసరాన్ని ఆయన మంత్రికి వివరించారు. కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, సంపూర్ణ వికాసం దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో చాగంటి కోటేశ్వరరావు దిశానిర్దేశంలో రూపొందించిన నైతిక విలువల పాఠ్యాంశాలను 'నో బ్యాగ్ డే' రోజున బోధిస్తున్న సంగతి తెలిసిందే. నైతిక విలువలతో కూడిన విద్య ద్వారానే సమగ్ర విద్యా వికాసం సాధ్యమని నమ్మిన ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగస్వామి కావడం పట్ల చాగంటి సంతోషం వ్యక్తం చేశారు. భేటీ ముగిసిన అనంతరం మంత్రి లోకేశ్ స్వయంగా చాగంటి గారిని కారు వద్దకు వచ్చి వినయపూర్వకంగా సాగనంపారు.

## రెండున్నరేళ్లలోనే ఆంధ్రప్రదేశ్‌కు రూ.19,619 కోట్లు

- మొదటి పేజి తరువాయి

ప్రభుత్వం మంగళవారం నాడు లోక్‌సభలో ప్రకటించింది. 2020 నుంచి 2024 మధ్య గత వైసీపీ ప్రభుత్వం సాధించిన రూ. 11,386 కోట్లతో పోలిస్తే ఇది అధికమని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పార్లమెంటులో ఈ వివరాలను అధికారికంగా సమర్పించింది. ఆర్థిక క్రమశిక్షణను పాటించడం, ప్రాజెక్టుల ప్రతిపాదనలను సకాలంలో సిద్ధం చేసి సమర్థవంతంగా అమలు చేయడం వల్లే స్వల్ప కాలంలోనే ఎక్కువ నిధులను సాధించగలిగామని తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం, 2020-21 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం రూ. 31,005.47 కోట్లు అందాయి. ఇందులో ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే రూ. 19,619 కోట్లు విడుదలయ్యాయి. 2024-25లో రూ. 7,901.56 కోట్లు, 2025-26లో రూ. 8,289.61 కోట్లు, 2026-27లో ఆగస్టు 1 నాటికి రూ. 3,428.14 కోట్లు మంజూరయ్యాయి. మూలధన వ్యయం కోసం రాష్ట్రాలకు 50 ఏళ్ల కాలపరిమితితో వడ్డీ లేని రుణాలను అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం.

గత ప్రభుత్వ హయాంలో 2020-21లో రూ. 688 కోట్లు, 2022-23లో రూ. 6,105 కోట్లు, 2023-24లో రూ. 4,090.81 కోట్లు ఈ పథకం కింద అందాయి. మరోవైపు, రాష్ట్ర విభజన జరిగిన 2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ లోటు రూ. 16,078.76 కోట్లుగా అకౌంటెంట్ జనరల్ నిర్ధారించినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అదే ఎంపీకి ఇచ్చిన మరో సమాధానంలో తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనానుభవం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. తద్వారా మరిన్ని పెట్టుబడులను ఆకర్షించి సమ్మిళిత వృద్ధిని సాధిస్తామని ధీమా వ్యక్తం చేసింది.

# వాళ్లది విధ్వంసం, మాది పునర్నిర్మాణం..

# రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేసిన చంద్రబాబు

**విభజన నష్టం కంటే విధ్వంసమే ఎక్కువ**

2014లో రాష్ట్ర విభజన బాధాకరమైనప్పటికీ, 2019-24 మధ్య జరిగిన విధ్వంసం అంతకంటే భయంకరమైన మానసిక వేదనను మిగిల్చిందని చంద్రబాబు అన్నారు. విభజన సమయంలో 58% జనాభాకు 46% వనరులే వచ్చాయని, అయినా ఐదేళ్లలో కష్టపడి ఆర్థిక వ్యవస్థను ఒక దారికి తెచ్చామని గుర్తుచేశారు. కానీ, గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలనూ నాశనం చేసిందని, అధికారుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసి, రాష్ట్రాన్ని అగమ్యగోచర స్థితిలోకి నెట్టిందని విమర్శించారు.

**ఆర్థిక గమనం.. రాష్ట్రాల మధ్య వ్యత్యాసం**

గత ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య తలసరి ఆదాయంలో వ్యత్యాసం విపరీతంగా పెరిగిపోయిందని చంద్రబాబు అంకెలతో సహా వివరించారు. "2014-15లో తెలంగాణ, ఏపీ మధ్య తలసరి ఆదాయ వ్యత్యాసం రూ.30,201గా ఉండేది. మా ఐదేళ్ల పాలనలో దాన్ని రూ.25,000కు తగ్గించగలిగాం. కానీ, 2019-24 మధ్య కాలంలో ఈ వ్యత్యాసం ఏకంగా రూ.1,06,854కు పెరిగిపోయింది. ఒకవేళ 2014-19 మధ్య సాధించిన 13.5% వృద్ధిరేటు కొనసాగి ఉంటే, రాష్ట్రానికి అదనంగా రూ.76,195 కోట్ల ఆదాయం వచ్చేది. అప్పుడు అప్పులు చేయాల్సిన అవసరం ఉండేది కాదు" అని ఆయన విశ్లేషించారు.

**అప్పుల ఊబిలోంచి బయటపడేస్తున్నాం**

గత ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ.9.74 లక్షల కోట్ల అప్పుల ఊబిలో ముంచిందని, నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం ఏపీ 'జీరో డెట్ సస్టైనబిలిటీ' స్థితికి చేరిందని, అంటే అప్పు పుట్టని దుస్థితికి వచ్చిందని చంద్రబాబు తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక పెండింగ్‌లో ఉన్న రూ.48,616 కోట్ల బిల్లుల్లో ఇప్పటికే రూ.29,000 కోట్లకు పైగా చెల్లించామని, ఉద్యోగుల బకాయిలు రూ.30,849 కోట్లు క్లియర్ చేశామని వివరించారు. అధిక వడ్డీలకు తీసుకున్న రూ.50,000 కోట్ల విలువైన 370 రుణాలను పునఃసమీక్షించి (రీ-నెగోషియేట్), ఏటా రూ.1,100 కోట్ల చొప్పున మొత్తం రూ.8,269 కోట్ల ఆదా చేశామన్నారు. నిధులు పక్కదారి పట్టడంతో నిలిచిపోయిన 86 కేంద్ర ప్రాయోజిత పథకాలను పునరుద్ధరించి, రూ.29,890 కోట్లు డ్రా చేయగలిగామని తెలిపారు.

**సంక్షేమానికి పెద్దపీట.. అభివృద్ధికి బాటలు**

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, సంక్షేమ హామీలను నెరవేర్చడంలో వెనకడుగు వేయలేదని చంద్రబాబు స్పష్టం చేశారు. గత రెండేళ్లలో సంక్షేమ పథకాల కోసం రూ.1,49,401 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా కింద రూ.68,296 కోట్లు, తల్లికి వందనం కింద రూ.20,210 కోట్లు, అన్నదాత సుఖీభవకు రూ.8,724 కోట్లు అందించామన్నారు. దీంతో పాటు, రెండేళ్లలో 30,607 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని, ఇందులో 15,941 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ చేపట్టామని గుర్తుచేశారు.

**P4, కుటుంబ సాధికారతతో పేదరిక నిర్మూలన**

సంక్షేమం అంటే కేవలం డబ్బులు ఇవ్వడమే కాదని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని చంద్రబాబు అన్నారు. ఇందుకోసం 'కుటుంబ సాధికారత మిషన్' ప్రారంభించామని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యానికి ప్రజల భాగస్వామ్యాన్ని జోడించి P4 అనే నూతన విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. 'మార్గదర్శి బంగారు కుటుంబం' (వీడీఖ 10-20) పథకం కింద సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్న 10% మంది, వెనుకబడిన 20% కుటుంబాలను దత్తత తీసుకుని వారిని ఆర్థికంగా పైకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

**అమరావతి, పోలవరం పూర్తి చేసి తీరతాం**

అమరావతి ప్రజల రాజధాని అని, అది ఒక సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టు అని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఫేజ్-1 పనుల కోసం ఇప్పటికే రూ.41,000 కోట్లకు పైగా నిధులు సమీకరించామని, త్వరలోనే పనులు వేగవంతం చేస్తామని తెలిపారు. అదేవిధంగా, రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును మార్చి నాటికి పూర్తిచేసి ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తామని ప్రకటించారు. దీనికోసం రూ.12,157 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు.

**మూడు ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ట్రిపుల్ ఇంజన్ వ్యూహం**

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి 'డబుల్ ఇంజన్ సర్కార్ - ట్రిపుల్ ఇంజన్ గ్రోత్' వ్యూహాన్ని అనుసరిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రాన్ని మూడు ఆర్థిక రీజియన్లుగా విభజించి అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు.

1. విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ (VER): పోర్ట్ ఆధారిత తయారీ, గ్రీన్ హైడ్రోజన్, ఏఐ, డేటా సెంటర్ల హబ్‌గా అభివృద్ధి చేస్తారు. సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులతో 10 లక్షల ఉద్యోగాలు లక్ష్యం.
2. అమరావతి ఎకనామిక్ రీజియన్ (AER): పరిపాలన, నాలెడ్జ్ క్యాపిటల్‌గా, ఏఐ, క్వాంటం, డేటా సెంటర్ల కేంద్రంగా తీర్చిదిద్దుతారు. రూ.6-8 లక్షల కోట్ల పెట్టుబడులు లక్ష్యం.
3. తిరుపతి ఎకనామిక్ రీజియన్ (TER): స్పేస్, డిఫెన్స్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, రెన్యువబుల్ ఎనర్జీ హబ్‌గా అభివృద్ధి చేస్తారు. రూ.10-12 లక్షల కోట్ల పెట్టుబడులతో 10 లక్షల ఉద్యోగాలు లక్ష్యం.

**ముందున్న సవాళ్లు.. భవిష్యత్ ప్రణాళిక**

రాష్ట్ర సొంత ఆదాయంలో 98% ఉద్యోగుల జీతభత్యాలకే సరిపోతోందని, ఇది కర్ణాటక (28%), తెలంగాణ (44%)తో పోలిస్తే చాలా అధికమని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదాయాన్ని పెంచుకుంటూ, ఖర్చులను అదుపు చేస్తూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సిన అవసరం ఉందన్నారు. పిపిపి, వైబిలిటీ గ్యాప్ ఫండింగ్ (VGF) ద్వారా మూలధన వ్యయాన్ని పెంచుతామని తెలిపారు. అంతిమంగా రాష్ట్రాన్ని ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన సమాజంగా తీర్చిదిద్ది, 'స్వర్ణాంధ్ర విజన్ 2047' సాధించడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఏ నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే బాస్

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవ ర్గంలో కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలు, వర్గపోరు అంశంపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, పార్టీ పరిశీలకుడు జగ్గారెడ్డి తన సమగ్ర నివేదికను సిద్ధం చేశారు. మొత్తం 7 పేజీలతో కూడిన ఈ రిపోర్టును సీల్డ్ కవర్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు ఆయన అందజేశారు.తుంగతుర్తి నియోజకవర్గంలో ఇటీవల చోటుచేసుకున్న ఘర్షణలు, వర్గ విభేదాలపై గత పది రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి ఇరువర్గాలు, స్థానిక నాయకులు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలను సేకరించినట్లు జగ్గారెడ్డి తెలిపారు. ఆ వివరాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈ నివేదికను రూపొందించినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన... ఏ నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే 'ఫస్ట్ బాస్' అని, ఆ తర్వాతి స్థానంలోనే ఎంపీ, మంత్రులు ఉంటారని స్పష్టం చేశారు. అలాగే మూడో ప్రాధాన్యత డీసీసీ అధ్యక్షుడికి ఉంటుందని వ్యాఖ్యానించారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి సంబంధించిన వివాదాలు, ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను కూడా ఈ నివేదికలో పొందుపరిచామని చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీకి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలు ప్రధాన స్తంభాలని ఈ సందర్భంగా జగ్గారెడ్డి పేర్కొన్నారు.

## జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన రేపల్లె నియోజకవర్గం టీడీపీ నేత

బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. రేపల్లెకు చెందిన టీడీపీ నేత గూడపాటి శ్రీనివాసరావు వైసీపీలో చేరారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో జగన్ సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు. గూడపాటికి వైసీపీ కండువా కప్పి జగన్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... గూడపాటి శ్రీనివాసరావును వైసీపీ కుటుంబంలోకి హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నామని తెలిపారు. రేపల్లె నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా శ్రమించాలని పిలుపునిచ్చారు.గూడపాటి శ్రీనివాసరావు చేరికతో రేపల్లె నియోజకవర్గంలో వైసీపీ మరింత బలపడిందని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. రానున్న రోజుల్లో క్షేత్రస్థాయి బలాబలాల దృష్ట్యా రేపల్లె నియోజకవర్గ రాజకీయం మరింత ఆసక్తికరంగా మారనుంది.

# నిరుద్యోగ సంక్షోభం.. మోదీ సర్కార్‌కు పెనుసవాల్.. బీబీసీ ప్రత్యేక కథనం!

పరీక్ష పత్రాల లీకేజీ ఉదంతాలపై దేశవ్యాప్తంగా యువత నిరసనలతో అట్టుడగడంతో, గత నెలలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిణామంతో మోదీ ప్రభుత్వం తాత్కాలికంగా సంక్షోభం నుంచి గట్టెక్కినప్పటికీ, యువతలో పేరుకుపోతున్న అసంతృప్తి భవిష్యత్తులో ప్రభుత్వానికి దీర్ఘకాలిక సవాల్‌గా మారనుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ మేరకు అంతర్జాతీయ వార్తా సంస్థ బీబీసీ ఓ కథనం వెలువరించింది.లీకేజీ కేసుల విచారణ నిమిత్తం ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని, పరీక్షా వ్యవస్థలో సంస్కరణల కోసం టెక్ నిపుణుడు నందన్ నీలేకని నేతృత్వంలో కమిటీని నియమిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. అయినప్పటికీ, తగిన ఉపాధి అవకాశాలు కల్పనలోనూ, ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యంతో కూడిన విద్యను అందించడంలోనూ విఫలమవుతున్న ప్రస్తుత వ్యవస్థపై యువతలో అసహనం పెరుగుతోంది. వారి ఆందోళనలను నివృత్తి చేయడానికి ప్రభుత్వం మరింత నిర్మాణాత్మకమైన ప్రయత్నాలు చేయాల్సి ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

ప్రముఖ ఆర్థికవేత్త సంతోష్ మెహ్రోత్రా బీబీసీతో మాట్లాడుతూ, "గత దశాబ్ద కాలంలో కార్మిక మార్కెట్ స్థితిగతులు క్షీణించాయి. వ్యవసాయేతర ఉద్యోగాల సృష్టి మందగించడంతో పాటు, వాస్తవ వేతనాలు కూడా స్తంభించిపోయాయి" అని వెల్లడించారు. బలహీనమైన ఆర్థిక వ్యవస్థ వల్ల ఉద్యోగాలకు గిరాకీ పెరగడం లేదని, మరోవైపు మన విద్యా వ్యవస్థ సైతం నాణ్యమైన మానవ వనరులను అందించడంలోవెనుకబడి ఉందని ఆయన విశ్లేషించారు.

అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ 'స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా 2026' నివేదిక ప్రకారం, ప్రస్తుతం పట్టభద్రుల్లో నిరుద్యోగిత రేటు గత 25 ఏళ్ల నాటి తరహాలోనే 35-40 శాతం వద్ద కొనసాగుతోంది. అయితే, పెరిగిన జనాభా దృష్ట్యా సమస్య తీవ్రత మరింత అధికంగా కనిపిస్తోంది. 2023 నాటికి 67 శాతం మంది గ్రాడ్యుయేట్లకు సరైన ఉపాధి లేదని ఈ నివేదిక స్పష్టం చేసింది. అదేవిధంగా, జీడీపీలో తయారీ రంగం వాటా 17 శాతం నుంచి 14 శాతానికి తగ్గడం, కృత్రిమ మేధ (ఏఐ) రాకతో ఐటీ రంగంలో నియామకాలు మందగించడం ఈ సంక్షోభాన్ని మరింత జటిలం చేస్తున్నాయి.

కేవలం ఏసీ కార్యాలయాల్లోని ఉద్యోగాలనే ఆశించకుండా, నైపుణ్యం ఆధారిత వృత్తులైన ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్ వంటి పనులను కూడా చేపట్టేందుకు యువత సిద్ధపడాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుత యువత తమ తల్లిదండ్రుల కంటే మెరుగైన జీవన ప్రమాణాలను పొందలేని పరిస్థితులు నెలకొన్నాయని, ఇది దేశానికి పెను ముప్పుగా పరిణమించకుండా మోదీ ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం.. ప్రముఖ నటుడు ప్రదీప్ రావత్ మృతి

- మొదటి పేజి తరువాయి

(ఆగస్టు 04) ముంబయిలో గుండెపోటుతో మృతి చెందారు.

ఆయన గత కొంత కాలంగా బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతున్నారు. ముంబైలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయినట్లు నటి విపన థప మీడియాకు తెలిపారు. ప్రదీప్ రావత్ తెలుగు, హిందీ, తమిళ సినిమాలతో దేశవ్యాప్తంగా ఫేమస్ అయ్యారు. తెలుగులో 2004లో వచ్చిన సై సినిమాలో భిక్షు యాదవ్ పాత్రతో చూపించిన విలనిజంతో పాపులర్ అయ్యారు. ఆ సినిమాకు బెస్ట్ విలన్ గా ఫిలింఫేర్ అవార్డు కూడా అందుకున్నారు. ఆ తర్వాత గజినీ, భద్ర,అందరివాడు, ఛత్రపతి, లక్ష్మీ, స్టాలిన్ మొదలైన సినిమాలతో తన విలనిజాన్ని పండించారు. లేటెస్టుగా వాల్తేరు వీరయ్య, గాయపడ్డ సింహం సినిమాల్లో నటించారు.

1952లో జబల్పూర్ లో జన్మించారు. ఆయనకు భార్య కళ్యాణి రావత్, ఇద్దరు కుమారులు విక్రమ్ రావత్, సింగ్ రావత్ లు ఉన్నారు. బీ.ఆర్ చోప్రా తెరకెక్కించిన మహాభారతంలో అశ్వత్థామ పాత్రతో ఆయన వెండితెరకు పరిచయమయ్యారు. ప్రదీప్ రావత్ దాదాపు 80 సినిమాల్లో నటించారు. హిందీలో సర్ఫరోష్, లగాన్, దీవార్, గజినీ సినిమాలతో మంచి పేరు తెచ్చుకున్నారు.

## ఆలస్యం చేస్తే చాలా కష్టం.. జనన మరణాల నమోదుకు కొత్త రూల్స్.. పార్లమెంట్‌లో బిల్లుకు ఆమోదం!

- మొదటి పేజి తరువాయి

లోక్‌సభలో ఇదివరకే ఆమోదం పొందిన ఈ బిల్లు, త్వరలోనే చట్టరూపం దాల్చనుంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు.తాజా సవరణల ప్రకారం, జనన లేదా మరణ ధ్రువీకరణ పత్రాలను ఆలస్యంగా నమోదు చేయాలంటే కఠిన నిబంధనలు వర్తిస్తాయి. ఘటన (పుట్టిన లేదా మరణించిన) జరిగిన ఏడాది తర్వాత (రెండేళ్ల లోపు) నమోదు చేయాల్సి వస్తే జిల్లా మేజిస్ట్రేట్ లేదా సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్ నుంచి ముందస్తు అనుమతి పొందడం తప్పనిసరి. ఒకవేళ రెండేళ్లు దాటిన పక్షంలో, ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు ఉంటేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది.ఈ సందర్భంగా మంత్రి నిత్యానంద రాయ్ మాట్లాడుతూ, జనన మరణాలను నిర్ణీత సమయంలోగా నమోదు చేయడాన్ని ప్రోత్సహించడంతో పాటు, తప్పుడు సమాచారం, అవకతవకలను అరికట్టడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 3.5 లక్షల రిజిస్ట్రేషన్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, 2014లో 86.6 శాతంగా ఉన్న జననాల నమోదు 2024 నాటికి 99 శాతానికి పైగా చేరిందని ఆయన వివరించారు. అదేవిధంగా మరణాల నమోదు 72.5 శాతం నుంచి 99.4 శాతానికి పెరిగిందని మంత్రి వెల్లడించారు.బిల్లుపై జరిగిన చర్చలో భాగంగా బీజేపీ ఎంపీ దర్శన సింగ్ మాట్లాడుతూ, ఈ కొత్త సవరణలు వ్యవస్థను మరింత సరళంగా, పారదర్శకంగా మారుస్తాయని కొనియాడారు. అయితే, రెండేళ్ల తర్వాత జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌ను ఆశ్రయించాలనే నిబంధనపై బీజేడీ ఎంపీ డాక్టర్ సంతృప్త్ మిశ్రా కొంత ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఇప్పటికే పనిభారంతో ఉన్న న్యాయస్థానాలపై మరింత ఒత్తిడి పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. వైసీపీ, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, బీఆర్ఎస్, అన్నాడీఎంకే సహా పలు పార్టీల సభ్యులు ఈ బిల్లుకు మద్దతు తెలిపారు.

# విద్యుత్ ఛార్జీలు పెంచలేదు, ట్రూడౌన్ చేశాం

- మొదటి పేజి తరువాయి

సౌర విద్యుత్ ద్వారా లక్షలాది కనెక్షన్లు ఇవ్వాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని వివరించారు.రాష్ట్రవ్యాప్తంగా పెరిగిన విద్యుత్ అవసరాలను తీర్చేందుకు కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేస్తున్నామని గొట్టిపాటి తెలిపారు. రైతులకు పెద్ద ఎత్తున వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నామని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని అన్నారు.'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో భాగంగా, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేసి, గత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూనే, తాము చేస్తున్న పనులను వారి దృష్టికి తీసుకెళుతున్నామని గొట్టిపాటి రవికుమార్ వివరించారు.

## అహంకారం వినాశనానికి దారితీస్తుంది

తమిళనాడులో డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్, అనంతరం విడుదల వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపింది. ఈ పరిణామంపై ఉదయనిధి తండ్రి, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తీవ్రస్థాయిలో స్పందించారు. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని టీవీకే (తమిళగ వెట్రి కళగం) ప్రభుత్వం అహంకారపూరితంగా వ్యవహరిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. "అహంకారం వినాశనానికి దారితీస్తుంది. అహంభావం మితిమీరితే పతనం మరింత వేగవంతం అవుతుంది" అని ఆయన హెచ్చరించారు.ప్రముఖ నటి త్రిషను ఉద్దేశించి ద్వంద్వార్థాలు వచ్చేలా వ్యాఖ్యానించారన్న ఆరోపణలతో పోలీసులు ఉదయనిధి స్టాలిన్‌ను మంగళవారం అరెస్టు చేశారు. సుమారు నాలుగు గంటలపాటు విచారించిన అనంతరం ఆయనను విడుదల చేశారు. అయితే, తన ప్రసంగంలో ఎలాంటి అసభ్యత లేదని ఉదయనిధి స్పష్టం చేశారు. కావేరి జలాల సాధనలో, మేకెదాటు డ్యామ్ నిర్మాణాన్ని అడ్డుకోవడంలో ప్రభుత్వ వైఫల్యాలను తాను ప్రశ్నించినందుకే, కక్షపూరితంగా ఈ చర్యలు తీసుకున్నారని ఆయన ఆరోపించారు.ఈ ఆరోపణలపై స్పందించే ధైర్యం లేక, కావేరి అంశం నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే ప్రభుత్వం ఉదయనిధిని అరెస్ట్ చేసిందని ఎం.కె. స్టాలిన్ విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాలకు ఒక్కరోజు ముందు ప్రతిపక్ష నేతను అరెస్ట్ చేయడం వెనుక రాజకీయ కుట్ర ఉందని, ఆయనను సభకు హాజరుకాకుండా అడ్డుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఆరోపించారు. రాజకీయ ప్రత్యర్థులు, విద్యార్థులు, రైతుల గొంతు నొక్కేందుకు టీవీకే ప్రభుత్వం అరెస్టులను ఒక ఆయుధంగా వాడుకుంటోందని డీఎంకే నేతలు విమర్శలు గుప్పించారు.

# కలెక్టర్ ఆదేశాలతో వరద సహాయం వెంటనే...

**-కూనవరంలో 668 మందికి నిత్యావసరాల పంపిణీ**

**కూనవరం,పెన్ పవర్, ఆగస్టు4.**వరద ముంపుకు గురై పునరావాస కేంద్రాలకు తరలివచ్చిన బాధితులకు జిల్లా కలెక్టర్ కె దినేష్ కుమార్ ఆదేశాల మేరకు నిత్యావసర సరుకులను వెంటనే పంపిణీ చేశారు.
కూనవరం ఉదయభాస్కర కాలనీ 170 మంది,తాళ్ల గూడెం 51మంది, బొజ్జరాయి గూడెం 153 మంది, శబరి కొత్తగూడెం 294 మంది. మొత్తం 668 మంది బాధితులకు ఉల్లిపాయలు,బంగాళదుంపలు, ఆయిల్ ప్యాకెట్లు,కందిపప్పు అందించారు.పునరావాస కేంద్రాల్లో ఉంటున్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని అధికారులు అన్నారు.ఈ పంపిణీ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి ధర్మేంద్ర, ఎంపీడీవో ఆశీర్వాదం,స్పెషల్ ఆఫీసర్ జగన్నాథం,ఆర్ఐ చెల్లాయమ్మ,వీఆర్వో రాజారాం, సచివాలయ



సిబ్బందితో కలిసి కూనవరం గ్రామ శాఖ కూటమి నాయకులు హెచ్.రవి పాల్గొన్నారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# చింతూరు డివిజన్లో వరద ప్రభావం తగ్గుముఖం

- ఇళ్లకు చేరుకున్న ప్రజలు -- సహాయక చర్యలు కొనసాగుతున్నాయి
- 10,828 కుటుంబాలకు సాయం... ముందస్తు చర్యలతో 2,124 మంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 4:** గోదావరి, శబరి నదుల వరద ప్రభావం తగ్గుముఖం పట్టడంతో పోలవరం జిల్లా చింతూరు డివిజన్‌లో పరిస్థితులు క్రమంగా సాధారణ స్థితికి చేరుకుంటున్నాయని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక, పునరావాస చర్యలను జిల్లా యంత్రాంగం నిరంతరం కొనసాగిస్తోందని పేర్కొన్నారు.
మంగళవారం రాత్రి విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 28.80 అడుగులకు, చింతూరు వద్ద శబరి నీటిమట్టం 20.10 అడుగులకు తగ్గిందన్నారు. దీంతో పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన ప్రజలు దశలవారీగా తమ ఇళ్లకు చేరుకుంటున్నట్లు తెలిపారు.చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఏటపాక మండలాల్లోని మొత్తం 77 గ్రామాలు, ఆవాసాలు వరద ప్రభావానికి గురయ్యాయని, 10,828 కుటుంబాలకు చెందిన 34,358 మంది ప్రభావితులయ్యారని చెప్పారు. 1,073 ఇళ్లు నీటమునిగినట్లు వెల్లడించారు.ముందస్తు చర్యల్లో భాగంగా 15 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి, 750 కుటుంబాలకు చెందిన 2,124 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు. అలాగే 149 మంది గర్భిణులను ముందుగానే వైద్య సేవల కోసం తరలించగా, 65 వైద్య శిబిరాల్లో 1,354 మందికి చికిత్స అందించినట్లు పేర్కొన్నారు. అవసరమైన మందులు, యాంటీ స్నేక్ వెనం, డాగ్ బైట్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచడంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు శాశ్వత జనరేటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.వీఆర్‌పురం, కూనవరం, చింతూరు, ఏటపాక మండలాల్లో పామాయిల్, కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు తదితర నిత్యావసర సరుకుల పంపిణీ కొనసాగుతోందన్నారు. తాగునీటి సరఫరా, పారిశుధ్య కార్యక్రమాలు, రహదారుల పునరుద్ధరణ, చెట్ల తొలగింపు పనులు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు.వరదల కారణంగా ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని, ఒక పశువు మృతి చెందినట్లు మాత్రమే నమోదు అయిందన్నారు. రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ తదితర శాఖలు 24 గంటలు అప్రమత్తంగా పనిచేస్తున్నాయని కలెక్టర్ తెలిపారు.ప్రజలు వదంతులను నమ్మకుండా అధికార యంత్రాంగం సూచనలు పాటించాలని, క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యటిస్తూ సమస్యలను పరిష్కరిస్తున్నారని కలెక్టర్ కె. దినేష్ కుమార్ పేర్కొన్నారు.



# ప్రభుత్వంచేపట్టిన వరదసహాయక చర్యలు





**-డీఆర్‌డీఏ,ప్రాజెక్టుడైరెక్టర్ డా.దాసరిరత్నాకర్**

**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.4**
గోదావరివరదలుకారణంగాముంపునకుగురైన గ్రామాల్లోప్రభుత్వంచేపడుతున్న,సహాయకచర్యలో డీఆర్‌డీఏ సిబ్బంది,క్లస్టర్ కోఆర్డినేటర్లు, సి.సి.లు, గ్రామసమాఖ్యల వీఓఏలు,(వి.ఓ.ఏ.ఎస్.)తప్పని సరిగాచురుకుగాపాల్గొని ప్రజలకుఅండగా నిలవా లని,పోలవరంజిల్లాగ్రామీణాభివృద్ధిసంస్థ(డీఆర్‌డీఏ) ప్రాజెక్టుడైరెక్టర్,డా.దాసరి రత్నాకర్,ఆదేశించారు.వి. ఆర్.పురంమండలమహిళాసమాఖ్య కార్యాలయం లోమంగళవారండీఆర్‌డీఏ సిబ్బంది,వీఓఏలతోనిర్వహించిన,సమీక్ష సమావేశంలో ప్రాజెక్టుడైరెక్టర్,డా.దాసరిరత్నాకర్,మాట్లాడుతూ,వరదప్రభావిత గ్రామాల్లోప్రజలనుఎప్పటికప్పుడుఅప్రమత్తం చేయడంతోపాటు ప్రభుత్వంచేపట్టే సహాయకచర్యల్లోక్రమశిక్షణతోపాల్గొ నాలని,సూచించారు .అనంతరం గ్రామాల్లో చేపట్టే పారిశుద్ధ్య కార్యక్రమాల్లోఅందరూభాగస్వాములు కావాలని,సీజనల్,వ్యాధుల నివారణపై,ప్రజలకు అవగాహన కల్పించి,ప్రతికుటుంబం ప్రతిఒక్కరూ పరిశుభ్రమైన,త్రాగునీరుత్రాగి,ఆరోగ్యం ఉండాలని, కోరారు.ఈనెలలో నిర్వహించేఅన్నిస్వయంసహాయ కసంఘాల సమావేశాల్లోఆరోగ్యం,పోషణ,వ్యక్తిగత పరిశుభ్రత,పరిసరాల పారిశు ద్ధ్యంపై తప్పనిసరిగా చర్చించి,సంఘసభ్యులకు అవగాహన కల్పించాలని, ఆదేశించారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో,ప్రభుత్వం అందిస్తున్న,నిత్యావసర సరుకులుఅర్హులైన ప్రజలకు సకాలంలో చేరేలా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని,క్లస్టర్ సీసీలు,వీ.ఓ.ఏ.లు పూర్తి సహకారం అందించాలని సూచించారు.స్వయంసహాయక సంఘ సభ్యుల జీవనోపాధి అవకాశాలను విస్తరించేందు కు డిజిటల్ ఎం.సి.పీ.డిజిటల్,ఎం.సి. పి.ద్వారామాత్రమే రుణాలు మంజూరు చేయాలని పేర్కొ న్నారు.సభ్యులకు అందించేరుణాలు,వారి పొదుపులు పూర్తిగాపారదర్శకం గాఉండేలా మన డబ్బులు--మన లెక్కలు'యాప్‌పై ప్రతి సభ్యునికి సమగ్రఅవగాహనకల్పించాలని,డీఆర్‌డీఏ సిబ్బందిని ఆదేశించారు.పోలవరం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భవిష్యత్తులో వెదురుకు పెరుగుతున్న డిమాండ్ నుదృష్టిలో ఉంచుకుని మండలంలో వెదురుసాగుకు ఆ సక్తి ఉన్నరైతులను పెద్దఎత్తునగుర్తించి,వెదురుపెంపకాన్ని ప్రోత్సహించే చర్యలు చేపట్టాలని,సూచించారు.ఈ కార్యక్రమంలోడీ.ఆర్.డీ.ఏ.ప్రాజెక్టు డైరెక్టర్ డా.దాసరి రత్నాకర్, మండల వెలుగు సిబ్బంది,క్లస్టర్ సీసీలు,గ్రామసమాఖ్యల వీఓఏలు పాల్గొ న్నారు.

# ప్రాంతీయ ఆసుపత్రికి ఐదు వీల్‌చైర్లు విరాళం

**మానవ సేవకు మించిన సేవ లేదన్న ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి**

**రాజమండ్రి దాత ఆర్. సత్తిబాబు సేవలను అభినందించిన ఎమ్మెల్యే**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 4:** శారీరక వైకల్యంతో బాధపడుతున్న వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. రాజమండ్రికి చెందిన దాత, బిర్యానీ వ్యాపారి ఆర్. సత్తిబాబు సహకారంతో సమకూరిన ఐదు వీల్‌చైర్లను మంగళవారం ఆమె చేతుల మీదుగా రంపచోడవరం ప్రాంతీయ ఆసుపత్రి పర్యవేక్షకులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సేవలకు తోడుగా దాతలు కూడా సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. మానవ సేవే గొప్ప సేవ అని పేర్కొంటూ, వైకల్యంతో ఇబ్బందులు పడుతున్న రోగులకు ఈ వీల్‌చైర్లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. సమాజంలో మరింత మంది దాతలు ఇలాంటి సేవా కార్యక్రమాలకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.వీల్‌చైర్లను అందించిన దాత ఆర్. సత్తిబాబును ఎమ్మెల్యే



ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ, స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు షేక్ చోటు సహకారంతో తమ కుటుంబ సభ్యుడు పిట్టా శ్రీనివాస్ స్మారకార్థంగా ఈ వీల్‌చైర్లను అందజేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ఆసుపత్రి సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి

**సీడీపీఓ వి. సుచరిత ఆదిలక్ష్మి**

**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 4:** పోలవరం జిల్లా గంగవరం మండలం ప్రాజెక్టు జగ్గంపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ సీడీపీఓ వి. సుచరిత ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సీడీపీఓ వి. సుచరిత ఆదిలక్ష్మి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన శిశువే ఆరోగ్యకరమైన కుటుంబానికి, బలమైన సమాజానికి పునాది అని అన్నారు. పుట్టిన శిశువుకు మొదటి గంటలోనే తల్లిపాలు పట్టించాలని, ఆరు నెలల వయస్సు వచ్చే వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. ఈ సమయంలో నీరు, పాలపొడి, తేనె, గ్లూకోజ్ వాటర్ తదితర ఆహార పదార్థాలు ఇవ్వకూడదని తెలిపారు.శిశువుకు పాలిచ్చేటప్పుడు పరిశుభ్రత పాటించడం, సరైన విధంగా ఒడిలో పెట్టుకుని పాలివ్వడం, పడుకుని పాలివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. పాలు తాగిన అనంతరం శిశువును భుజంపై ఉంచి డక్కా వచ్చేలా చేయాలని



సూచించారు. అలాగే బాలింతలు పోషకాహారంతో కూడిన ఆహారం, ముఖ్యంగా ఆకుకూరలు తీసుకోవడం ద్వారా తల్లిపాల నాణ్యత మెరుగుపడుతుందని తెలిపారు.కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ పి. చిన్నసీత, అంగన్‌వాడీ కార్యకర్తలు కె. పాపయమ్మ, రమణమ్మ, కె. లక్ష్మి, జి. చెల్లాయమ్మ, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన నాయకులు





**పెన్ పవర్ -- ఏలూరు, ఆగస్టు 04**
జిల్లా ఇంచార్జ్ మంత్రి, జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజు పార్టీ నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు.
మంగళవారం ఏలూరు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సమీక్ష సమావేశానికి హాజరైన మంత్రి నాదెండ్ల మనోహర్‌ను అనంతరం ఏలూరులో కలిసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.
ఈ సందర్భంగా జిల్లా జనసేన పార్టీ ఇంచార్జ్ కొటికలపూడి గోవిందరావు, డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణలను కూడా సువర్ణ రాజు బృందం మర్యాదపూర్వకంగా కలిసింది.
ఈ కార్యక్రమంలో గోపాలపురం నియోజకవర్గ ఐటీ కోఆర్డినేటర్ వనమట్ల సత్యకిరణ్, గున్నంపల్లి సొసైటీ చైర్మన్ సుధాకర్, గుండుగొలనుకుంట సొసైటీ చైర్మన్ అద్దంకి సోమశేఖర్, మండల పార్టీ ఉపాధ్యక్షులు చిలుకూరి పాని, జనసేన పార్టీ సీనియర్ నాయకులు తరగల్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలి





- అమరావతి స్పోర్ట్స్ మీట్‌కు జిల్లా స్థాయి ఎంపికలు ప్రారంభం
- ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 4:** పోలవరం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి చేరుకోవాలని రంపచోడవరం ఎమ్మెల్యే, లెజిస్లేటివ్ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీషా దేవి పిలుపునిచ్చారు.మంగళవారం రంపచోడవరం జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన అమరావతి స్పోర్ట్స్ మీట్ జిల్లా స్థాయి ఎంపికల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ లెజిస్లేటివ్ కమిటీ సభ్యుడు, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, రంపచోడవరం ఆర్డీవో కె. స్వాతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 17 నుంచి 23 సంవత్సరాల మధ్య వయస్సు గల విద్యార్థుల కోసం 12 రకాల క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల విజేతలకు రూ.94 లక్షల ప్రైజ్ మనీ ప్రకటించారని పేర్కొన్నారు. పోలవరం జిల్లా విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబర్చి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి గురువారం యోగా నిర్వహిస్తూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. క్రీడలతో పాటు విద్యలోనూ రాణించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు.జిల్లా స్థాయి నుంచి అమరావతి స్పోర్ట్స్ మీట్‌కు విద్యార్థులను తీసుకెళ్లేందుకు 150 మంది ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలను జిల్లా యంత్రాంగం నియమించినట్లు వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం కలిసి వివిధ క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మైనారిటీ డైరెక్టర్ షేక్ సుభాని, ఏపీఐఐసీ డైరెక్టర్ జి. పెద్దిరాజు, జిల్లా క్రీడల అధికారులు వి. కృష్ణారావు, కె. పోతురాజు, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి జి. త్రిమూర్తులు, ఏజెన్సీ డీఈవో వై. మల్లేశ్వరరావు, తహసీల్దార్ సిహెచ్. బాలాజీ, డీఎస్‌డీఓ సతీష్ కుమార్, మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా పారదర్శకంగా తయారు కావాలి





**బీజేపీ నాయకుల పిలుపు**

**చింతూరు, ఆగస్టు 4:**కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా రూపొందేందుకు బీజేపీకి చెందిన బీఎల్ఓ ఏజెంట్లు చురుకుగా పనిచేసి ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్వప్న కుమారి, జిల్లా అధ్యక్షుడు బుల్లి కొండల దొర పిలుపునిచ్చారు. మంగళవారం చింతూరులో బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు బట్ట లక్ష్మణ్ రాజు అధ్యక్షతన నిర్వహించిన బీఎల్ఓ ఏజెంట్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగాలంటే ఓటరు జాబితాలో ఉన్న దొంగ ఓట్లు, మరణించిన వారి పేర్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిపోయిన వారి ఓట్లను తొలగించడంతో పాటు అర్హులైన ప్రతి ఓటరిని జాబితాలో చేర్చడం బీఎల్ఓల బాధ్యత అని పేర్కొన్నారు. ఓటరు జాబితా స్వచ్ఛంగా, తప్పులులేకుండా రూపొందించేందుకు ప్రతి బీఎల్ఓ ఏజెంట్ క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేయాలని, పార్టీ విజయానికి కృషి చేయాలని నాయకులు సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు పాయం వెంకయ్య, డీవీఎస్ఎన్ రమణారెడ్డి, మండల ముఖ్య నాయకులు, సీనియర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వేటమామిడి రైతు సేవా కేంద్రంలో రైతులకు శిక్షణ తరగతులు...




**అడ్డతీగల ,పెన్ పవర్, ఆగస్ట్ 04:**అడ్డతీగల మండలం లో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని వేటమామిడి రైతు సేవా కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త గోవర్ధన్ పాల్గొన్నారు. గోవర్ధన్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్నినో ప్రభావం వల్ల సాధారణ వర్షపాతం కంటే దాదాపు 30% తక్కువగా వర్షపాతం నమోదు అయ్యిందని ఆయన తెలిపారు. ఈ కారణాల చేత రైతులు వరి పంటకు ప్రత్యామ్నాయంగా అపరాలను మరియు చిరుధాన్యాలు సాగును చేపట్టినట్లయితే తక్కువ నీటితో పండించవచ్చని ఆయన సూచించారు. ఆముదం పంటను కూడా సాగు చేసినట్లయితే నీటి ఎద్దడిని తట్టుకుంటుందని మరియు కోతుల బెడద నుంచి పంటను కాపాడుకోవచ్చని గోవర్ధన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అడ్డతీగల సహాయ వ్యవసాయ సంచాలకులు సావిత్రి మాట్లాడుతూ రసాయన ఎరువులకు బదులుగా జీవన ఎరువులైన రైజోబియం అజటోబక్టర్ ,అజో స్పైరీలం, పి ఎస్ బి వంటి వాటిని వినియోగించడం వల్ల భూమి సారవంతం అవుతుందని మరియు నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని సావిత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల వ్యవసాయ అధికారి సి.హెచ్ శివ శ్రీనివాస్ మాట్లాడుతూ, మండలంలో దాదాపుగా 150 టన్నుల యూరియా అందుబాటులో ఉందని రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని శివ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిపిఎం శ్రీ రాబిన్ మాట్లాడుతూ రైతులందరూ బహు పంటల విధానాన్ని అలవర్చుకోవాలని దీనివలన నిరంతర అధిక ఆదాయం లభిస్తుంది అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంతాల్లో వైద్యం, విద్యా సేవలపై ఎస్టీ లెజిస్లేటివ్ కమిటీ క్షేత్రస్థాయి పరిశీలన

రంపచోడవరం ఏరియా ఆసుపత్రి, మాతా-శిశు కేంద్రం, వసతి గృహాల సందర్శన







**గంగవరం/రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 4:** గిరిజన ప్రాంతాల్లో వైద్య, విద్యా సేవల అమలు తీరును పరిశీలించేందుకు ఎస్టీ లెజిస్లేటివ్ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీషా దేవి, కమిటీ సభ్యుడు, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మంగళవారం రంపచోడవరంలో క్షేత్రస్థాయిలో పర్యటించారు.ఈ సందర్భంగా స్థానిక ఏరియా ఆసుపత్రి, ప్రసూతి ఆసుపత్రి--మాతా శిశు కేంద్రం, గిరిజన బాలికల సంక్షేమ వసతి గృహం, గిరిజన బాలుర గురుకుల ఆశ్రమ పాఠశాలను సందర్శించి అక్కడి సేవలను పరిశీలించారు. ఏరియా ఆసుపత్రిలో దంత వైద్య విభాగం, ఔట్‌పేషెంట్ వార్డు, స్కానింగ్ కేంద్రాన్ని పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ప్రసూతి విభాగాన్ని సందర్శించి మాతా--శిశు ఆరోగ్య సేవల అమలును పరిశీలించారు.ఏరియా ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవల కింద జనరల్ సర్జరీ, ఈఎన్టీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్స్, నేత్ర వైద్యం, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్ తదితర ఏడు విభాగాల్లో వైద్య సేవలు అందుతున్నట్లు అధికారులు కమిటీకి వివరించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మిరియాల శిరీషా దేవి మాట్లాడుతూ గిరిజన ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక వసతులు, వైద్య సిబ్బంది, పరికరాల లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఔట్‌పేషెంట్ సేవలను మరింత విస్తరించాలని సూచించారు.అనంతరం గిరిజన బాలికల వసతి గృహం, గురుకుల ఆశ్రమ పాఠశాలను సందర్శించిన కమిటీ సభ్యుడు రేగం మత్స్యలింగం విద్యార్థులకు అందుతున్న వసతి, మధ్యాహ్న భోజనం, బోధన, మౌలిక వసతులపై ఆరా తీశారు. గిరిజన ప్రాంతాల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు నిరంతరం కృషి చేయాలని అధికారులకు సూచించారు.ఈ పర్యటనలో మైనారిటీ డైరెక్టర్ షేక్ సుభాని, ఏపీఐఐసీ డైరెక్టర్ జి. పెద్దిరాజు, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి జి. త్రిమూర్తులు, ఏజెన్సీ డీఈవో వై. మల్లేశ్వరరావు, తహసీల్దార్ సీహెచ్. బాలాజీ,వైద్యాధికారులు, జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## గాయని సుస్మిత కు ఎమ్మెల్యే అభినందనలు





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్ ఆగస్టు 04:**భక్తి సంగీత కార్యక్రమాల ద్వారా హిందూ సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేస్తున్న చిక్కాల సుస్మిత ను స్థానిక శాసన సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అభినందించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం సురాగవర్ధిని బృందం సభ్యులు ఎమ్మెల్యే ను మర్యాద పూర్వంగా కలిశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్యాత్మిక సంస్థ వ్యవస్థాపకులు పండిట్ రవిశంకర్ గురూజీ స్ఫూర్తితో చిక్కాల సుస్మిత ఆధ్వర్యంలో సురాగవర్ధిని బృందం తాడేపల్లిగూడెం లో జూలై 26న 'భజన జామింగ్ 'కార్యక్రమం నిర్వహించి భక్తి సంగీతం ద్వారా ప్రజలలో ఆధ్యాత్మిక చైతన్యం కలిగించారని అన్నారు. ఉద్యోగులు, వ్యాపారులు, వైద్యులు, ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు, కార్మిక, కర్షక, శ్రామిక తదితర అన్ని వర్గాలకు చెందిన ప్రజలు ఈ భక్తి సంగీత కార్యక్రమాల వల్ల మానసిక ప్రశాంతత పొందటమే కాకుండా సమాజంలో సనాతన ధర్మం పట్ల అవగాహన పెరుగుతుందని అన్నారు.ఇలాంటి మంచి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని సూచించారు.

## చూటూరు గ్రామంలో డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించిన కూటమి నాయకులు





**చింతూరు, పెన్ పవర్, ఆగస్టు 4:** ముకునూరు పంచాయతీ పరిధిలోని చూటూరు గ్రామంలోని 355వ బూత్‌లో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, గత రెండు సంవత్సరాల్లో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లిన టిడిపి, జనసేన నాయకులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, ప్రభుత్వానికి ప్రజలు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇంచార్జ్ ఓబిళ్లనేని నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి మల్లెల వెంకటేశ్వరరావు, యూనిట్ ఇంచార్జ్ సీలం తమ్మయ్య, బూత్ ఇంచార్జ్ కారం సత్యవతి, జట్పాటి అంజి పాల్గొన్నారు. అలాగే జనసేన నాయకులు బేడే సతీష్, తీగల రవి, మల్లిపూడి సతీష్, పయ్యాల ప్రవీణ్, మిడియం రమణమ్మ, పోడియం నాగార్జున తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని నాయకులు తెలిపారు.

## వరద బాధిత గిరిజన గ్రామాల్లో నిత్యావసర సరుకుల పంపిణీ

సహాయక కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ మండల అధ్యక్షుడు మొహమ్మద్ జమాల్ ఖాన్



**చింతూరు, పెన్ పవర్, ఆగస్టు 4:** ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కల్లేరు పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాల్లో మంగళవారం నిత్యావసర సరుకులు, కూరగాయల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ జమాల్ ఖాన్ పాల్గొని బాధిత కుటుంబాలకు సహాయ సామగ్రిని అందజేశారు. వరద ప్రభావిత గ్రామాల్లో ప్రజల పరిస్థితిని పరిశీలించిన ఆయన, బియ్యం, కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. వరదల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, అవసరమైన సహాయక చర్యలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. సహాయక కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వరద ప్రత్యేక అధికారి అన్వేష్, తహసీల్దార్ అర్జున్ రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్, చింతూరు వీఆర్వో రామచంద్ర, ఇతర రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఉద్యానరంగంలో సాంకేతిక విప్లవానికి డా. వైఎస్సార్ హెచ్‌యూ -- ఐఐటీ తిరుపతి ముందడుగు





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్ ఆగస్టు 4**

డా. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో "ఆధునిక సాంకేతిక ఉద్యానవనం అంశంపై ఐఐటీ తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్. సత్యనారాయణతో శాస్త్రవేత్తల ముఖాముఖి సమావేశం నిర్వహించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి డా. ధనుంజయరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విశ్వవిద్యాలయ అధికారులు, డీన్లు, డైరెక్టర్లు, విభాగాధిపతులు, శాస్త్రవేత్తలు పాల్గొని ఉద్యానరంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సంయుక్త పరిశోధనలకు ఉన్న అవకాశాలపై విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఉద్యానరంగంలో ఎదురవుతున్న పరిశోధనా అవసరాలు, సాంకేతిక లోటుపాట్లను ఐఐటీ తిరుపతి దృష్టికి తీసుకెళ్లారు. డ్రోన్ సాంకేతికత, కృత్రిమ మేధస్సు ఆధారిత పురుగుల గుర్తింపు, పర్యవేక్షణ, పాలీహౌస్‌లో కూరగాయలు, పూల పంటల ఉత్పత్తిలో ఏఐ వినియోగం, కోతులు, ఎలుకల నియంత్రణకు సెన్సార్ ఆధారిత వ్యవస్థలు, పంటల్లో పురుగు మందుల అవశేషాల తగ్గింపు, కోత అనంతర నష్టాల నివారణ, స్మార్ట్ ఇరిగేషన్, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఆధారిత సాంకేతికతల అభివృద్ధిపై పలు ప్రతిపాదనలు సమర్పించారు.

ఈ ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించిన ప్రొఫెసర్ కె.ఎన్. సత్యనారాయణ, డా. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం --ఐఐటీ తిరుపతి శాస్త్రవేత్తలతో త్వరలో ఒకరోజు సంయుక్త కార్యశాలను నిర్వహించి, రైతులకు ఉపయోగపడే సాంకేతిక పరిష్కారాల అభివృద్ధికి సంయుక్త పరిశోధన ప్రాజెక్టులు చేపడతామని హామీ ఇచ్చారు. అలాగే విద్యార్థులు, అధ్యాపకుల పరస్పర మార్పిడి, అత్యాధునిక పరిశోధన సదుపాయాల వినియోగం, ఇరు సంస్థల మధ్య దీర్ఘకాలిక శాస్త్రీయ సహకారానికి పూర్తి మద్దతు అందిస్తామని తెలిపారు. ఉపకులపతి డా. ధనుంజయరావు ఈ భాగస్వామ్యం ద్వారా ఉద్యానరంగంలో ఆధునిక సాంకేతికత ఆధారిత వినూత్న పరిశోధనలు, రైతు సంక్షేమానికి దోహదపడే సాంకేతిక పరిష్కారాలు అభివృద్ధి చెందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## డిఎస్సీ కుంభకోణంపై సిబిఐ విచారణ జరిపించాలి

- ఢిల్లీలో విద్యార్థులపై కేసులు ఉపసంహరించాలి
- మార్గాని భరత్ రామ్ ఆధ్వర్యంలో అఖిల పక్ష సమావేశం




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 4:** రాష్ట్రంలో జరిగిన డిఎస్సీ కుంభకోణం పై సిబిఐ విచారణ జరిపించాలని,

ఢిల్లీలో విద్యార్థులపై కేసులు ఉపసంహ రించాలని మాజీ ఎంపీ, వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మార్గాని భరత్ రామ్ డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో స్థానిక వై-జంక్షన్‌లో ఆనం రోటరీ హాల్‌లో అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. మార్గాని భరత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కాంగ్రెస్, సిపిఐ, ఇతర రాజకీయ పక్షాలు, మేధావులు,న్యాయవాదులు, డాక్టర్లు, వర్తక, వ్యాపార ప్రముఖులు హాజర య్యారు. మాజీ ఎంపీ మార్గాని భరత్ మాట్లాడుతూ, నీట్ పేపర్ లీక్ అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి నట్టుగానే ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన డిఎస్సీ పేపర్ లీకేజీ, అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన నీట్, డిఎస్సీ వంటి పరీక్షలను నిర్వహించ డంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం దారుణమన్నారు. భవిష్యత్తులో ఇటువంటి అక్రమాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోక పోతే విద్యార్థులకు తీరని నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేసారు. ఢిల్లీ ఆందోళనల్లో విద్యార్థులపై పెట్టిన కేసులను ఉప సంహరిం చాలని నాయకులు డిమాండ్ చేసారు. ఈ సమావేశంలో వైసిపి పార్లమెంట్ ఇన్‌చార్జ్ డాక్టర్ గుడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్య ప్రకాశరావు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, డిసిసి అధ్యక్షుడు బోడ వెంకట్, కాంగ్రెస్ పార్లమెంట్ కో ఆర్డినేటర్ టీకే విశ్వేశ్వరరెడ్డి, చాంబర్ మాజీ అధ్యక్షుడు అశోక్ కుమార్ జైన్, న్యాయవాది మద్దూరి శశిభూషణ్, వైద్యుడు డాక్టర్ శశాంక, అఖిల పక్షం కన్వీనర్ దేశిరెడ్డి బలరామ నాయుడు, రమేష్, బర్రే కొండబాబు, పలువులు విద్యావేత్తలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. పేపర్ లీక్ చేసిన నిందితులకు 10 సంవత్సరాల జైలు శిక్ష సరిపోదని ఉరిశిక్ష లేదా, జీవిత ఖైదు విధించాలని డిమాండ్ చేసారు. కార్పొరేట్ విద్యావ్యవస్థను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించడం వల్లనే విద్యను వ్యాపారంగా మార్చి పేపర్ లీక్ ఘటనలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసారు. వారికున్న రాజకీయ పలుకుబడితో పేపర్లను లీక్ చేసి లక్షల మంది భవిష్యత్తును ప్రశ్నార్థం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. అనంతరం సమావేశంలో చేసిన తీర్మానాలను బీసీ నాయకులు మార్గాని నాగేశ్వరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపుతా మని తెలిపారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



సీఐ గోపాలకృష్ణ హెచ్చరిక




**చింతూరు, పెన్ పవర్, ఆగస్టు 4:** ఆగస్టు 7, 8, 9 తేదీల్లో కొన్ని సంఘాలు, సంస్థలు బంద్‌లు, ప్రజా సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో చింతూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ ప్రజలకు కీలక సూచనలు చేశారు. ఈ మూడు రోజుల పాటు ఎటువంటి చట్టవిరుద్ధ సమావేశాలు, ర్యాలీలు, రహదారి దిగ్బంధనలు లేదా బంద్‌ల నిర్వహణకు పోలీసు శాఖ నుంచి ఎలాంటి అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించడం, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలను బలవంతంగా మూసివేయించడం, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆస్తులకు నష్టం కలిగించడం వంటి చర్యలు చట్టవిరుద్ధమని తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా బంద్‌లు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించినా, వాటిలో పాల్గొన్నా లేదా ఇతరులను ప్రేరేపించినా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)తో పాటు అమలులో ఉన్న ఇతర చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ గోపాలకృష్ణ హెచ్చరించారు. చింతూరు పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్న వదంతులు, అసత్య సమాచారాన్ని నమ్మకుండా తమ దైనందిన కార్యకలాపాలను యథావిధిగా కొనసాగించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు సహకరించాలని సీఐ గోపాలకృష్ణ విజ్ఞప్తి చేశారు.




## శంభునగర్ రైతు బజార్ లో బియ్యం షాపును ప్రారంభించిన ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ ఆగస్టు 4:** ప్రజలకు సన్నబియ్యాన్ని కూటమి ప్రభుత్వం తక్కువ ధరకు ఇస్తుందని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. రైతు బజార్లు రైస్ మిల్లుల అవుట్లెట్ స్టోర్లలో తగ్గింపు ధరలకు బియ్యం విక్రయాలలో భాగంగా మంగళవారం 17వ డివిజన్ శంభోనగర్ రైతుబజార్ లో బియ్యం షాపును ఎమ్మెల్యే గోరంట్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ఆగస్టు ఒకటో తేదీ నుండి రైతు బజార్లు రైస్ మిల్లుల అవుట్లెట్ స్టోర్లలో సన్న బియ్యం కిలో 65 నుండి 70 రూపాయలు ఉండే బియ్యాన్ని 50 లకు ప్రతి కుటుంబానికి నెలకు 10 కేజీల చొప్పున అందిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం స్మార్ట్ షాపులను ఏర్పాటు చేస్తుందని, అనేక రకాల వస్తువులను తక్కువ ధరలకు అమలు చేయబోతుందన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర హెల్త్ వింగ్ ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవి రామ్ కిరణ్, ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, , రొంపిచర్ల యాంటోని, నిమ్మలపూడి గోవిందు, శీలం గోవిందు, చలమూరి సత్యనారాయణ, ఏడాకుల వెంకటేశ్వరరావు, కక్కల రమేష్, చిట్టిబోయిన శ్రీనివాస్, పల్లి సాయి, బూర దుర్గారావు, సింగవరపు సత్యనారాయణ, పీత వంశి, పి.మల్లేశ్వరి, యు.రవణమ్మ, డి.రాణి, వై.ధనలక్ష్మి, వై.గీత, ఎం.రాణి, సుబ్రహ్మణ్యం, రాజబాబు, సాహూ, మార్కెట్ కమిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సురక్షిత తాగునీరు, పారిశుద్ధ్యంపై జిల్లా కార్యశాల



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 4:** నగరంలో ఏపీ ఎం ఏ ఎస్ సంస్థ, వాటర్ ఆర్గనైజేషన్ సహకా రంతో వాటర్, శానిటేషన్ అండ్ హైజీన్ అంశంపై మంగళవారం వై టి సి ప్రాంగణం లో జిల్లా స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తూర్పు గోదావరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. పి. కొమలి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

ఈ సందర్భంగా డా. కోమలి మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో సురక్షితమైన తాగునీరు, పరిశుభ్రమైన పారిశుద్ధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత కీలకమని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో డయేరియా, కలరా, టైఫాయిడ్, హెపటైటిస్ వంటి నీటి ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించాలంటే ప్రతి ఒక్కరూ సురక్షితమైన తాగునీటిని వినియోగించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఇంటిలో తాగునీటిని పరిశుభ్రమైన పాత్రల్లో నిల్వ చేసుకోవడం, మరుగుదొడ్లను తప్పనిసరిగా వినియోగించడం, భోజనం చేసే ముందు మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత సబ్బుతో చేతులు కడుక్కోవడం వంటి పరిశుభ్రత అలవాట్లను ప్రతి ఒక్కరూ పాటించాలని ఆమె పిలుపునిచ్చారు.

ప్రజల్లో సురక్షిత తాగునీరు, పారిశుద్ధ్యంపై అవగాహన పెంపొందించేందుకు ఏపీ మాస్, వాటర్ ఆర్గ్ సంస్థలు చేపడుతున్న కార్యక్రమాలను ఆమె అభినందించారు. ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేస్తే ప్రజారోగ్యంలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు.

ఈ వర్క్‌షాప్‌లో మెప్మా , అప్మా, డి ఆర్ డి ఏ అధికారులు, ఏరియా ప్రాజెక్ట్ మేనేజర్లు ఇతర సంబంధిత అధికారులు పాల్గొని, జిల్లాలో సురక్షిత తాగునీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత కార్యక్రమాల విస్తరణపై చర్చించారు.

## రూ.75 లక్షల చిట్‌ఫండ్ మోసం భార్యాభర్తల అరెస్ట్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 4:** ఆగస్టు 4: స్థానిక అన్నపూర్ణమ్మపేటకు చెందిన మల్లెడ రేవతి, మల్లెడ గోవింద అనధికారికంగా చిట్‌ఫండ్ నిర్వహిస్తూ ప్రజల నుంచి భారీ మొత్తంలో డిపాజిట్లు సేకరించి, మెచ్యూరిటీ చిట్ మొత్తాలను చెల్లించకుండా మోసం చేసిన కేసులో 1 టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. క్రైమ్ నెం. 232/168/2026 కింద 1982 ప్రకారం జూలై 27న కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విచారణలో నిందితులు ప్రభుత్వ అనుమతులు ఉన్నట్లు నమ్మబలికి రూ.1 లక్ష నుంచి రూ.18 లక్షల వరకు చిట్ పథకాలు నిర్వహించి, ప్రారంభంలో కొందరికి చెల్లింపులు చేసి విశ్వాసం సంపాదించిన అనంతరం భారీ మొత్తంలో డబ్బు వసూలు చేసి పరారైనట్లు తేలింది. ఇప్పటివరకు నమోదైన ఫిర్యాదుల ప్రకారం ఏడుగురు బాధితుల నుంచి రూ.75 లక్షలకు పైగా వసూలు చేసి, ఆ డబ్బుతో ఇళ్లు, స్థలాలు కొనుగోలు చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఇతర బాధితులు, ఆస్తులు, ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేని చిట్‌ఫండ్ లేదా డిపాజిట్ పథకాలలో పెట్టుబడులు పెట్టవద్దని, అనుమతి లేకుండా చిట్టీలు నిర్వహిస్తున్న వారిపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని 1 టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎన్. మురళీకృష్ణ విజ్ఞప్తి చేశారు.

## ధవళేశ్వరం లో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ, మానవహారం




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 4 :**

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల (ఆగస్టు 1 నుండి 7 వరకు) సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.ఎస్. రాజు ఆదేశాల మేరకు కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ధవళేశ్వరంలో రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ లో తల్లిపాల వారోత్స వాల అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు.ఈ సందర్భంగా కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా. వి.వి. దుర్గాప్రసాద్ మాట్లా డుతూ, శిశువుకు పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలను ప్రారంభిం చడం, మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలనే ఇవ్వడం, అనంతరం రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం అనుబంధ ఆహారంతో పాటు తల్లిపాలను కొనసాగిం చడం వల్ల శిశువు సంపూర్ణ ఎదుగుదల, రోగనిరోధక శక్తి పెంపు, మంచి తెలివైన బిడ్డలుగా ఎదుగుదల , తల్లి ఆరోగ్య సంరక్షణకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. కుటుంబ సభ్యులు, సమాజం, ఆరోగ్య సిబ్బంది కలిసి ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలు అందిం చేందుకు అనుకూల వాతావరణాన్ని కల్పించాలని పిలుపు నిచ్చారు.ప్రొఫెసర్ ఆరోగ్య కార్యక్రమాల సమన్వయాధికారి డా. బి. శ్రీనివాస్ నాయక్ జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. తల్లిపాల ప్రాముఖ్యత, శిశు పోషణ, తల్లి-శిశు ఆరోగ్యం, అపోహల నివారణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

అనంతరం నిర్వహించిన మానవహారంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొని తల్లిపాల ప్రాధాన్యాన్ని తెలియజేసే నినాదాలు చేశారు. తల్లిపాలే శిశువుకు తొలి టీకా, సంపూర్ణ ఆహారం, సురక్షితమైన పోషకాహారం అని ప్రజలకు వివరించారు. తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగిస్తూ ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలను అందించా లని పిలుపు నిచ్చారు.

ఈ కార్యక్రమంలో డా. ఆర్. సురేంద్రబాబు, డా. కె. దీప్తి (అసిస్టెంట్ ప్రొఫెసర్లు), వైద్యాధికారి డా. ఆర్.వి.వి. సత్యనారాయణ, డా. రోహిత, డా. భరత్ శాస్త్రి, మూర్తి, ప్రసన్న సామాజిక శాస్త్రోపన్యా సకులు , శ్రీనివాస్, కె.వి. రామాదేవి , కె. వెంకటలక్ష్మి , ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశా కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా ఏపీ నిట్ 8వ స్నాతకోత్సవం






- నూతన విక్షిత్ భారత్‌ను నిర్మించేందుకు తయారీ రంగంలోని అవకాశాలపై దృష్టి పెట్టండి
- ఐ లాబ్స్ గ్రూప్ చైర్మన్ చింతలపాటి శ్రీనివాసరాజు

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఆగస్టు 0 4:**నూతన విక్షిత్ భారత్‌ను నిర్మించేందుకు తయారీ రంగంలోని అవకాశాలపై దృష్టి పెట్టాలని ఐ లాబ్స్ గ్రూప్ చైర్మన్ చింతలపాటి శ్రీనివాసరాజు సూచించారు. జాతీయ సాంకేతిక విద్యా సంస్థ (ఎన్ఐటీ) ఆంధ్రప్రదేశ్ లో విద్యనభ్యసించిన 2022-26 బ్యాచ్ విద్యార్థులకు 8వ స్నాతకోత్సవ వేడుకలను డీన్ అకడమిక్ డాక్టర్ ఎన్.జయరామ్ ఆధ్వర్యంలో ప్రాంగణంలోని రవీంద్ర కళా భారతి ఆడిటోరియంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ ఎన్.వి.రమణారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన ఐ లాబ్స్ గ్రూప్ చైర్మన్ చింతలపాటి శ్రీనివాసరాజు మాట్లాడుతూ విద్యార్థి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంతో పాటు వారి ఉన్నతకి అవసరమైన లోకజ్ఞానాన్ని అందించేవి
విద్యాలయాలేనని, ప్రతి విద్యార్థి ఎదుగుదలలో గురువుల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉంటుందని తెలిపారు. విద్యార్థులు దేశం గర్వించేలా వినూత్న పరిశోధనలు, ఆవిష్కరణల రూపకల్పనకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ఏ రంగాన్ని ఎంచుకున్నా ఆయా రంగాల్లో నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని చెప్పారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఎప్పటికప్పుడు కొత్త కొత్త సాంకేతికతలు ఆవిష్కృతమవుతున్నాయని, వాటిలో మెలకువలు నేర్చుకుని పట్టు సాధిస్తే ఉన్నత శిఖరాలను సులువుగా అధిరోహించవచ్చని తెలిపారు. ఏ దేశ ఆర్థిక వ్యవస్థకైనా ఆయువుపట్టు యువతరమేనని, దేశ గతిని, స్థితిని మార్చే సత్తా నవతరానికే ఉందని తెలిపారు. జీవితంలో ప్రతిక్షణం ఎంతో విలువైనదని, నిత్య అన్వేషిగా రోజు ఏదొక విషయాన్ని నేర్చుకోవటంపై విద్యార్థులు దృష్టిపెట్టాలని సూచించారు. జీవితంలో చిత్తశుద్ధి అనేది అత్యంత ముఖ్యమైనదని చెప్పారు. చదువులో రాణించాలనే తపన, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ముందడుగు వేస్తే విజయ శిఖరాలను సులువుగా చేరుకోవచ్చని చెప్పారు. యువత తమలోని శక్తియుక్తులను వెలికితీసి కాలానికి అనుగుణంగా తగిన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రతి విమర్శను సమర్థవంతంగా, సానుకూలంగా ఎదుర్కొని వాటిని భవిష్యత్తుకు మెట్టుగా మలుచుకోవలన్నారు. తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా విద్యార్థులు సరైన లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకు నిరంతరం శ్రమించాలని చెప్పారు. చదువు, సేవా కార్యక్రమాలతోపాటు ఆధ్యాత్మికంగానూ ఎదగాలని తెలిపారు. దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడు తమవంతు భాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఎన్ఐటి ఆంధ్రప్రదేశ్ లో విద్యార్థులు సంపాదించిన జ్ఞానం, నైపుణ్యాలు వారి జీవితంలో ముందడుగు వేయడానికి ఎంతగానో దోహదపడతాయని వివరించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఐఐటీ తిరుపతి డైరెక్టర్, ప్రొఫెసర్ కె.ఎన్. సత్యనారాయణ మాట్లాడుతూ స్నాతకోత్సవం అనేది కేవలం డిగ్రీ అందుకునే కార్యక్రమం మాత్రమే కాదని, విద్యార్థి జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది పలికే మైలురాయని తెలిపారు. ఈ డిగ్రీ వారి కృషి, క్రమశిక్షణ, జిజ్ఞాస, పట్టుదలకు నిదర్శనమని చెప్పారు. కొత్త నైపుణ్యాలను అలవరచుకోవడం, జీవితాంతం నేర్చుకునే తత్వాన్ని పెంపొందించుకోవాలని పట్టభద్రులకు సూచించారు. భారతదేశం తయారీ, అంతరిక్షం, పునరుత్పాదక ఇంధనం, అర్థవాహకాలు, నూతన ఆవిష్కరణల రంగాల్లో ప్రపంచ నాయకత్వం దిశగా అడుగులు వేస్తోందని, ఈ ప్రయాణంలో యువ ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులు తమ వ్యక్తిగత విజయాలకే పరిమితం కాకుండా సమాజానికి ఉపయోగపడే సాంకేతిక పరిష్కారాలపై దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలకు అందుబాటులో వైద్య సాంకేతికత, స్థిరమైన ఇంధన పరిష్కారాలు, మెరుగైన మౌలిక సదుపాయాలు, విద్యా, పాలనకు ఉపయోగపడే డిజిటల్ సాధనాల అభివృద్ధి వంటి అంశాలపై పనిచేయాలని కోరారు. విజయవంతమైన జీవితానికి ఐదు ముఖ్య సూత్రాలను కూడా ఆయన వివరించారు. ప్రతి రంగంలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం, మంచి వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవడం, అపజయాలను అధిగమించే ధైర్యాన్ని అలవరచుకోవడం, సహకార భావంతో పనిచేయడం, సమాజ సేవను జీవిత లక్ష్యంగా చేసుకోవడం ద్వారా గొప్ప విజయాలు సాధించవచ్చని తెలిపారు. భవిష్యత్తుపై సందిగ్ధత సహజమేనని, అయితే ధైర్యం, నిరంతర కృషి, విలువలతో కూడిన జీవన విధానం ప్రతి విద్యార్థిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తుందని వివరించారు. అధ్యక్షత వహించిన ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ ఎన్.వి.రమణారావు మాట్లాడుతూ 2026 బ్యాచ్‌కు చెందిన బీటెక్, పీహెచ్‌డీ పట్టభద్రులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల త్యాగం, అధ్యాపకుల అంకితభావం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చింతలపాటి శ్రీనివాసరాజుకు, గౌరవ అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ కె.ఎన్. సత్యనారాయణకు సంస్థ తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వారి ప్రేరణాత్మక సందేశాలు పట్టభద్రులకు భవిష్యత్తులో మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. ఎన్ఐటీ ఆంధ్రప్రదేశ్ పదేళ్ల విజయవంతమైన ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని మరో మైలురాయివైపు అడుగులు వేస్తోందని చెప్పారు. విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, పరిశ్రమలతో భాగస్వామ్యం, సమాజానికి ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధిలో సంస్థ విశేష పురోగతి సాధించిందని చెప్పారు. ఈ స్నాతకోత్సవంలో 644 మంది బీటెక్, 53 మంది పీహెచ్‌డీ విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేయడం సంస్థ అభివృద్ధికి నిదర్శనమని తెలిపారు. దేశ నిర్మాణంలో తమ జ్ఞానం, నైపుణ్యాలను వినియోగించి సమాజానికి సేవ చేయాలని పట్టభద్రులకు పిలుపునిచ్చారు. సంస్థ ప్రతిష్ఠను చాటుతూ జాతీయ స్థాయిలో ఎన్ఐటీ ఆంధ్రప్రదేశ్ విశిష్ట గుర్తింపు పొందుతోందని ఆయన తెలిపారు. జాతీయ సంస్థల శ్రేణీకరణలో 2025 సంవత్సరానికి ఇంజినీరింగ్ విభాగంలో 201--300 ర్యాంక్ సాధించగా, భారతీయ విద్యా సంస్థల శ్రేణీకరణ 2026లో దేశవ్యాప్తంగా 66వ ర్యాంక్, రాష్ట్రంలో 3వ ర్యాంక్ దక్కడం గర్వకారణమని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.411.20 కోట్ల వ్యయంతో తొలి దశ మౌలిక వసతుల నిర్మాణం పూర్తి చేసుకుందని తెలిపారు. ఆధునిక ప్రయోగశాలలు, పరిశోధనా కేంద్రాలు, విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్యా వాతావరణం కల్పించేందుకు సంస్థ కృషి చేస్తోందన్నారు. అధ్యాపకులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పరిశోధన ప్రాజెక్టులు, పురస్కారాలు సాధించడం సంస్థకు మరింత ప్రతిష్ఠ తీసుకువచ్చిందని పేర్కొన్నారు.
భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగుతూ, జాతీయ ప్రాధాన్యత కలిగిన విద్యా సంస్థగా ఎన్ఐటీ ఆంధ్రప్రదేశ్‌ను మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని డైరెక్టర్, ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు పిలుపునిచ్చారు. పరిశోధనలు, ప్రాజెక్టులు, ఎంఓయూలు, స్పోర్ట్స్, గేట్ ఎగ్జామ్స్, ప్లేస్మెంట్స్, స్టూడెంట్స్ క్లబ్స్, గ్రంధాలయం, విద్యార్థులు, ఆచార్యులు సాధించిన ప్రగతి నివేదికను అందజేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన డీన్ అకడమిక్ డాక్టర్ ఎన్.జయరామ్ ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం 2022-26 బ్యాచ్ లో నాలుగేళ్ళ ఇంజినీరింగ్ కోర్సును పూర్తిచేసుకున్న 664 మంది బీటెక్ విద్యార్థులకు డిగ్రీలు, పిహెచ్డి పూర్తి చేసుకున్న 53 మంది పరిశోధన విద్యార్థులకు డాక్టరేట్ పట్టాలను ప్రధానం చేశారు. వీరితోపాటు కోర్సులవారీగా అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన 8 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ (బంగారు పతకాలు) అందజేశారు. బ్యాచ్ లో అందరికంటే ఎక్కువ గ్రేడ్ పాయింట్లు సాదించిన విద్యార్థిని సమయమంతుల అవ్యక్త ఇనిస్టిట్యూట్ తరపున, కోర్సువారీగాను రెండు బంగారు పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్లు డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి, డాక్టర్ వి.సందీప్, డాక్టర్ జీబి వీరేష్ కుమార్, డాక్టర్ హిమబిందు, సెనేట్ సభ్యులు, పలువురు విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.



# వీకర్స్ కాలనీ యు పి హెచ్ సి లో ప్రపంచ తల్లిపాల వారోత్సవములు







**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఆగస్టు 04.**ఆగస్టు 1 వ తేదీ నుంచి 7 వ తేది వరకు జరిగే ప్రపంచ తల్లిపాల వారోత్సవములు వీకర్స్ కాలనీ యు పి హెచ్ సి లో నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమం అన్ని అంగన్వాడి కేంద్రాల్లో నిర్వహించి తల్లులకు తల్లిపాల యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం జరుగుతుంది అని దాన్లో భాగంగా అంగన్వాడి వర్కర్లు, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు అందరూ కూడా తమ పరిధిలోని తల్లిలందరికీ తల్లి పాల ప్రాముఖ్యత ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించాలని ముర్రు పాలు బిడ్డ కు మొదటి టీకా అని, 6నెలల వరకు కేవలం తల్లిపలే ఇవ్వాలని వీకర్స్ కాలనీ మరియు ఎన్టీఆర్ జంక్షన్ యూ పీ హెచ్ సి మెడికల్ ఆఫీసర్స్ డ్ర శ్రావ్య మరియు డ్రా వన్యశ్రీ తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో ఇసిడిసెస్ సూపర్వైజర్స్ సిహెచ్ దుర్గ భవాని, కె విశాలాక్షి మరియు ఏ ఎం ఎమ్ లు ఆశ వర్కర్స్, అంగన్వాడీ వర్కర్స్ హాజరైనారు.

## చేబ్రోలు, కాగుపాడు, కైకరంలో తల్లిపాల వారోత్సవాలు



**పెన్ పవర్ ၊ ఉంగుటూరు ၊ ఆగస్టు 04**
గర్భిణులు, బాలింతలు తల్లిపాల ప్రాముఖ్యతపై పూర్తి అవగాహనతో ఉండి, శిశువులకు తొలి ఆరు నెలలు తల్లిపాలే అందించాలని చేబ్రోలు, కాగుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు డాక్టర్ మాసన, డాక్టర్ శ్రావణ్ రెడ్డి సూచించారు.
ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మంగళవారం చేబ్రోలు, కాగుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. అదే విధంగా కైకరం అంగన్‌వాడీ కేంద్రంలో కూడా తల్లిపాల ప్రాధాన్యంపై చైతన్య కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం వల్ల సంపూర్ణ పోషకాహారం లభించడంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ తల్లిపాలపై అపోహలను విడనాడాలని సూచించారు.
కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శారదామణి, బీవీ శ్రీలక్ష్మి, ఎం. భాగ్యలక్ష్మి, పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## 6న మోడల్ కెరీర్ సెంటర్లో జాబ్ మేళా

--- జిల్లా ఉపాధి అధికారి: సి హెచ్ శిరీష

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 4 :**తూర్పు గోదావరి జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అర్బన్ నియోజకవర్గంలోని ఉపాధి కార్యాలయం ప్రాంగణంలో ఆగష్టు 6వ తేదీ (గురువారం) ఉదయం 9:00 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిహెచ్. శిరీష తెలిపారు.
ఈ మేళాలో ప్రముఖ డెల్టా అగ్రిమెక్ , రిలయన్స్ రిటైల్ ఎల్ ఎమ్ ఎస్ . కంపెనీలలో పలు పోస్టుల భర్తీకొరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయని ఆమె తెలిపారు. పదవ తరగతి,ఇంటర్, ఐ టి ఐ, ఏదైనా డిగ్రీ, ఎమ్ బిఎ పూర్తి చేసి అనుభవం ఉన్న లేదా ఆశక్తి గల 19 నుండి 30 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని వివరించారు. ఎల్ ఎమ్ ఎస్ కార్పొరేట్ సర్వీస్ . హోస్సుర్ , కర్ణాటక లో కొన్ని హెచ్ అర్ పోస్టు ఉన్నాయని, ఆపరేటర్ పోస్టు ఉన్నాయని ఎంపికైన వారికి మంచి జీతం,ఉచిత భోజన, వసతి,రవాణా ఏర్పాట్లు కంపెనీ చేస్తుందని,ఎంపికైన వారికి తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు.ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయి, రెజ్యూమే, ఆధార్ సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో సిద్ధంగా మేళాకు హాజరుకావాలని సూచించారు.
మరిన్ని వివరాలకు 9533221189 నంబర్‌ను సంప్రదించ వచ్చని జిల్లా ఉపాధి అధికారి సిహెచ్ శిరీష తెలిపారు.

## వాహనాల డాక్యుమెంట్లు సక్రమంగా ఉంచుకోవాలి

సీఐ గోపాలకృష్ణ, ఎస్ఐ సంతోష్ కుమార్





**చింతూరు, పెన్ పవర్, ఆగస్టు 4:**ఆటోలు, మేజిక్ వాహనాలకు సంబంధించిన అన్ని రికార్డులు సక్రమంగా ఉండాలని చింతూరు సీఐ గోపాలకృష్ణ, ఎస్ఐ సంతోష్ కుమార్ సూచించారు. డాక్యుమెంట్లు లేకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. చట్టి, చింతూరు గ్రామాల్లో ఆటో, మేజిక్ యూనియన్ డ్రైవర్లు, యజమానులతో పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలకు సీ బుక్, ఇన్సూరెన్స్, ఫిట్నెస్ సర్టిఫికెట్ తదితర పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. వాహనాలను అధిక వేగంతో నడపరాదని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటోల్లో ప్రయాణించే మహిళల పట్ల గౌరవంగా వ్యవహరించాలని డ్రైవర్లకు సూచించారు. అలాగే ఆటోలు, మేజిక్ వాహనాలను రోడ్డుకు ఒకవైపు వరుస క్రమంలో నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని కోరారు. విధి నిర్వహణలో ఉన్నప్పుడు డ్రైవర్లు యూనిఫారం ధరించి క్రమశిక్షణతో మెలగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ గోపాలకృష్ణ, ఎస్ఐ సంతోష్ కుమార్‌తో పాటు ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన

శాస్త్రీయ సాగు పద్ధతులు పాటించాలని సూచన



**గంగవరం /రాజవొమ్మంగి, పెన్ పవర్, ఆగస్టు 4:** పోలవరం జిల్లా రాజవొమ్మంగి మండలం కొండపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీసా గ్రామసభ ఉపాధ్యక్షుడు కోటం వెంకటేశ్వరావు పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ సంధ్య మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు తక్కువ నీటి అవసరమయ్యే పప్పుధాన్యాలు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను ఎక్కువగా ఉపయోగించాలని తెలిపారు.ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు (క్రాప్ బుకింగ్) చేయించుకోవడంతో పాటు పంట బీమాలో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం సంభవించినప్పుడు ప్రభుత్వ పరిహారం, ఇతర ప్రయోజనాలు పొందేందుకు పంట బీమా ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు.పీసా గ్రామసభ ఉపాధ్యక్షుడు కోటం వెంకటేశ్వరావు మాట్లాడుతూ, మారుతున్న వాతావరణ పరిస్థితులను రైతులు సవాలుగా కాకుండా అవకాశంగా మలుచుకోవాలని అన్నారు. వ్యవసాయ శాఖ అందిస్తున్న శాస్త్రీయ సూచనలు పాటిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎల్‌నినో ప్రభావంపై ప్రతి రైతుకు పూర్తి అవగాహన కల్పించేందుకు గ్రామస్థాయిలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# ఓటే ఆయుధం - ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి...

-బిజెపి పిలుపు





**కూనవరం,పెన్ పవర్,ఆగస్టు4.** ప్రజాస్వామ్యంలో ఓటు కీలకమని, బోగస్ ఓట్లు తొలగించి కొత్త ఓటర్లను చేర్చాలని బిజెపి పోలవరం జిల్లా అధ్యక్షులు ఇక బుల్లికొండలు దొర అన్నారు. కూనవరం మండల బిజెపి సదస్సులో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ప్రక్రియలో బూత్ లెవెల్ ఏజెంట్లు, కార్యకర్తలు చురుగ్గా పాల్గొనాలని కోరారు.మండలంలోని ప్రతి బూత్ లో సర్వే నిర్వహించి ఓటర్ జాబితాను పటిష్టం చేయాలని నాయకులకు,కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బిఎల్ఏ స్వప్న కుమారి,మండల అధ్యక్షులు కరక పవన్ కుమార్,ఇంచార్జ్ డివిఎస్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీలో న్యాయం గెలిచింది



**జీలుగుమిల్లి, పెన్ పవర్, ఆగస్టు 4 ;** గత 25 ఏళ్లుగా అధికారుల చుట్టూ కోర్టుల చుట్టూ తిరగగా మాకు తగిన ప్రతిఫలం లభించింది అని రైతులు కొలుసు కోటేశ్వరరావు, కొలుసు గోపాయలు తెలిపారు. మంగళవారం రాచన్న గూడెం గ్రామంలో సర్వే నెంబరు 12 లో 5.33 ఎకరాల భూమి కోర్టు ఆర్డర్ ప్రకారం పోలీసులు ఆధ్వర్యంలో తమకు అప్పగించినట్లు వారు తెలిపారు. ఏజెన్సీలో చట్టం పట్ల మాకు అభిమానం ఉన్నట్లు తెలిపారు. హైకోర్టు ఆర్డర్ ప్రకారం మా భూమిని మాకు అప్పగించినట్లు వారు తెలిపారు. ట్రాక్టర్లతో దున్ని మా భూమిని మాకు అప్పగించినట్లు వారు ఆనందం వ్యక్తం చేశారు. చట్టం ప్రకారం మా భూమిని మాకు అప్పగించిన పోలీసు వారికి వారు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిలుగుమిల్లి సిఐ బి యాదగిరి, ఎస్సై వి క్రాంతి కుమార్, వీఆర్వో తిరుపతమ్మ ,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# 10వ డివిజన్ లో కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శంకుస్థాపన



**రాజమహేంద్రవరంపెన్ పవర్ ఆగస్టు 4 :**ఆరోగ్యకర, పరిశుభ్రమైన నగర నిర్మాణమే తమ ప్రభుత్వ లక్ష్యమని, గోదావరి పుష్కరాల నాటికి నగరాన్ని సకల సౌకర్యాలతో తీర్చిదిద్దుతామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) తెలిపారు. స్థానిక 10వ డివిజన్ విఎల్ పురం వినాయకుడి ఆలయం వద్ద రూ.7.85 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఆర్‌సీసీ కల్వర్టు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసారు. ఈ కల్వర్టు చిన్నది కావడటంతో మోడల్ కాలనీ, ఆల్ బ్యాంక్ కాలనీ ప్రజల రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాకాలంలో నీటి ప్రవాహానికి ఆటంకం ఉండదన్నారు. రోడ్లు, డ్రైన్లు, పార్కుల అభివృద్ధి, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ రెండళ్లలో నగరంలో రూ.300 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే వెల్లడించారు. ఇటీవల మరో రూ.100 కోట్ల అభివృద్ధి పనులకు , డ్రైనేజ్ వ్యవస్థ సమగ్ర ప్రక్షాళన కోసం రూ.140 కోట్ల పనులకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. మొత్తంగా రూ.240 కోట్ల మేర అభివృద్ధి పనులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు చొప్పేర్ల భద్రరావు, ఖాన్ భాయ్, కంటిపూడి రాజేంద్రప్రసాద్, అప్పారావు, నగర పాలక సంస్థ తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలోబిజెపి ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ జన్మదిన వేడుకలు.



ప్రత్యేక పూజలు, సేవ కార్యక్రమాలు.

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఆగస్టు 04.**పార్లమెంటరీ నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నకేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల సహాయ మంత్రి, బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకులు భూపతి రాజు శ్రీనివాస్ వర్మ బిజెపి కార్యకర్తలకు ఆదర్శనీయులని నాయకులు పేర్కొన్నారు. కేంద్ర మంత్రిగా నియోజకవర్గశీ లోని ఎమ్మెల్యేలకు చేయూతనిస్తూ అభివృద్ధికి కృషి చేస్తున్న కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ కేంద్రమంత్రి అంటే ఈ విధంగా పని చేయాలన్న రీతిలో ప్రజల మన్ననలను అందుకుంటున్నారని బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాగేశ్వరావు ప్రశంసించారు. ఆయన మరి ఎన్నో ఉన్నత పదవులు సాధించి రాష్ట్రానికి నియోజకవర్గానికి ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోట రాంబాబు మాట్లాడుతూ ప్రజలు నాయకుల అంచనాల మించి నియోజకవర్గ అభివృద్ధిలో కేంద్ర మంత్రి పోతున్నారని పేర్కొన్నారు. మరిన్ని ఉన్నత పదవులు సాధించి తమ సేవలను మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. అతని అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ కార్యకర్త స్థాయి నుంచి నిబద్ధత తో కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగిన శ్రీనివాస్ వర్మ అభివృద్ధికి మారుపేరుగా నిలిచారని ప్రశంసించారు. ఆయన మరింత ఉన్న స్థాయికి ఎదిగి సేవలందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శులు చిట్యాల రాంబాబు, కావ్యరెడ్డి, ముత్యాలమ్మవారి ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు రామగాని సత్యనారాయణ,ఓ బిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మారిశెట్టి నరసింహ మూర్తి, అచ్యుత దుర్గాప్రసాద్, ఉప్పులూరిమధు,జన్మదినోత్సవ సందర్భంగా భారతీయ జనతా పార్టీ పట్టణ కమిటీ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం తాడేపల్లిగూడెం పట్టణంలో ప్రత్యేక పూజలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక డిఎస్ చెరువు సమీపంలోని శ్రీనివాస రామాలయంలో బిజెపి పట్టణ దువ్వా శ్రీను ఆధ్వర్యంలో శ్రీనివాస్ వర్మ పేరిట ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా మోర్చా ఆధ్వర్యంలో మహిళా మోర్చా పట్టణ కమిటీ అధ్యక్షురాలు గోకా మహాలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక గాయత్రీదేవి ఆలయంలో కేంద్ర మంత్రి భూపాతిరాజు శ్రీనివాస వర్మ జన్మదినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సన్నిధి నాగదుర్గ, పట్టణ కార్యదర్శి కసిరెడ్డి నాగదుర్గ, బిజెపి నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళా కళాశాల లో మొక్కలు నాటిన నేతలు: స్థానిక బి వి కె మహిళా కళాశాల ప్రాంగణం లో బిజెపి నాయకులు ఫలసాయమిచ్చే మొక్కలను నాటారు. మామిడి, పనస, బత్తాయి, సపోటా వంటి మొక్కలను యువమోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింధు పైడికొండల, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోట రాంబాబు, పట్టణ మాజీ అధ్యక్షులు ముప్పిడి సురేష్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యులు అడపా రమేష్,ప్రధాన కార్యదర్శి కావ్య రెడ్డి,మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు సూర్య కుమారి చేకూరి బంగార్రాజు మహిళా మోర్చా అధ్యక్షురాలు గోకా మహాలక్ష్మి, పట్టణ కార్యదర్శి కసిరెడ్డి నాగదుర్గ నవీనకుమార్,కళాశాల ప్రిన్సిపాల్ గణపతి రామ్,గంట వెంకట లక్ష్మి,కార్యకర్తలు పాల్గొన్నారు. చీరలు పంచిన బిజెపి నేతలు కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ జన్మదినోత్సవ సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాల్లో భాగంగా బిజెపి నాయకులు ముప్పిడి సురేష్ రెడ్డి తదితరులు స్థానిక దొమ్మర్ల కాలనీలో పేద మహిళలకు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. బిజెపి నాయకులు మహిళా మోర్చ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ప్రజాహితమే కూటమి ప్రభుత్వ లక్ష్యం





- కుల, మత రాజకీయాలకు తావివ్వొద్దు
- ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఆగస్టు 04:**ప్రజాహితం, రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, కుల, మత రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ భారతీయులుగా ఆలోచించాలని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం మండలం జగ్గన్నపేట గ్రామంలో మంగళవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రజా సమస్యలను స్వీకరించి పరిష్కారానికి అవసరమైన సూచనలను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గన్న పేట గ్రామంలో ఇప్పటికే సుమారు రూ.4 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, మరో రూ.5--6 కోట్ల పనులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. గ్రామీణ రహదారులు, లింక్ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యమైన 'వికసిత్ భారత్--2047' సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు . కులం, మతం కంటే మానవత్వం, భారతీయత ముఖ్యమని పేర్కొన్నారు. దేశ సరిహద్దుల్లో సైనికులు కులాలకు అతీతంగా దేశం కోసం సేవలందిస్తున్న స్ఫూర్తిని ప్రజలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విద్యారంగంలో అంతర్జాతీయ విద్యా ప్రమాణాలను నెలకొల్పే విధంగా నిరంతరం శ్రమిస్తూ,16 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చిన విద్యా శాఖ మంత్రి లోకేష్ ను రాజీనామా చేయాలనటం వైసిపి నీచ రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ల సమర్ధవంతమైన నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి కోసం, దేశంలో ప్రథమ స్థానం సాధించేందుకు నిరంతరం కృషి జరుగుతుందని ఆయన అన్నారు. భోగాపురం విమానాశ్రయం, పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని నిర్మాణం వంటి కీలక ప్రాజెక్టులు వేగంగా అమలవుతున్నాయని తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. వైసిపి నేతలు ప్రతి అంశాన్ని రాజకీయ కోణంలో చూడడం మానుకోవాలని హితవు పలికారు. జగన్ పాలనలో గ్రామీణ అభివృద్ధి నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించారు.ప్రస్తుతం గ్రామాల అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. జనసేన,టిడిపి, వైసిపి అధినేత లను ఆయా సామాజిక వర్గాల ప్రజలు తమ నాయకులుగా చెప్పుకోవడం సహజమని అన్నారు. అంతకుమించి కులానికి ఎలాంటి ప్రాధాన్యత లేదని అన్ని సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు కలిసి గెలిపిస్తేనే ఎవరైనా నాయకులు కాగలరని వ్యాఖ్యానించారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తూ రాష్ట్రాన్ని దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచే విధంగా కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రత్యేక అధికారి యు. శ్రీనివాస్ తహసిల్దార్ సునీల్ కుమార్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఇతర అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# రూ.46.20 లక్షలతో నిర్మించిన కెమిస్ట్రీ, బయాలజీ ల్యాబ్ లు ప్రారంభం





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 4:** రాష్ట్రవ్యాప్తంగా 67 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం కూటమి ప్రభుత్వం అమలు చేసిందని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. మంగళవారం రూరల్ మండలం సాటిలైట్ సిటీ గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్ జూనియర్ కాలేజీ లో 46.20 లక్షలతో నూతనంగా నిర్మించిన కెమిస్ట్రీ ల్యాబ్, బయాలజీ ల్యాబ్ లను ఎమ్మెల్యే గోరంట్ల ప్రారంభించారు. ఇంటింటి కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ సంక్షేమ విజయాల కరపత్రాలను పంపిణీ చేస్తూ, ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తున్నామని, ఉత్తీర్ణత శాతం బాగుందన్నారు. జూనియర్ కాలేజీ చుట్టూ ప్రహరీ పనులు మొదలు పెడతామని హామీ ఇచ్చారు. ఈ ల్యాబ్స్ లో పరికరాలు ఏర్పాటుకు సొంత నిధులు లక్ష రూపాయలు అందిస్తానని తెలిపారు. స్కూల్ లో టాయిలెట్లు నిర్మించేందుకు వాష్ ఇనిస్టూట్ సంస్థ ఏడు లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని 90శాతం ఆ సంస్థ వారు నిధులు కేటాయిస్తారని, మిగిలిన 10 శాతం 70 వేల రూపాయలను ఎమ్మెల్యే గోరంట్ల సొంత నిధులు అందిస్తానని తెలిపారు. అనంతరం జూనియర్ కాలేజీ లో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ప్రేమలత విద్యార్థిని మొదటి సంవత్సరంలో 466 సాధించిన సందర్భంగా రూ.5000 రూపాయల నగదు ప్రోత్సాహాన్ని ఎమ్మెల్యే అందించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర హెల్త్ వింగ్ ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవి రామ్ కిరణ్, రూరల్ మండలం తెదేపా అధ్యక్షులు మత్స్యేటి ప్రసాద్, ఎంపీడీవో సునీల్ ఆర్మ్ స్ట్రాంగ్, ఎంఈఓ తులసీదాస్, స్కూల్ హెచ్.ఎం నున్న ప్రశాంతి, , గ్రామ కమిటీ అధ్యక్షులు నిచ్చినకోళ్ల సత్తిబాబు, ఎమ్మెస్సార్ శ్రీను, చోడదా లాజర్, బైరుత్తి సరోజినీ దేవి, గెద్దాడ వెంకటకృష్ణ, దార అన్నవరం, తనుబుద్ధి సుబ్బయ్య, షేక్ బాషా, బుడంపర్తి రామకృష్ణ, ర్యాలి సత్తిరాజు, అలంకార్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# బ్రెయిన్ శస్త్రచికిత్స మహిళకు కుడిపూడి మందుల సహాయం

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 4:** నగరంలోని స్థానిక మూడో వార్డు రాజేందర్ నగర్‌కు చెందిన బెజవాడ ఏడుకొండలు ఇటీవల బ్రెయిన్‌కు సంబంధించిన శస్త్రచికిత్స చేయించు కున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఆమెకు అవసరమైన నెలవారీ మందులను అందజే స్తున్నారు. హామీ మేరకు ఈ నెల కూడా రెండో విడత సుమారు రూ.7,000 విలువైన మందులను ఆమెకు అందజేశారు. ఆమె పూర్తిస్థాయిలో కోలుకుని తిరిగి సాధారణ దైనందిన జీవితంలో పాల్గొనాలని ఆకాంక్షించారు. అవసరంలో ఉన్న వారికి అండగా నిలవడం సామాజిక బాధ్యతని, భవిష్యత్తులో ప్రజలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని కుడిపూడి తెలిపారు.



# తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇద్దాం..డాక్టర్ మహేష్ రెడ్డి..



**అడ్డతీగల, పెన్ పవర్, ఆగస్ట్ 08:**అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రం లో మంగళవారం డాక్టర్ పి. మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాలా వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ పి. మహేష్ రెడ్డి అధ్యక్షత వహించి ఆయన మాట్లాడుతూ పిల్లలకు మొదటి గురువు తల్లి అని డాక్టర్ మహేష్ రెడ్డి అన్నారు.తల్లులకు తల్లిపాలు ప్రాముఖ్యతపై అమూల్యమైన సలహాలు సూచనలు గర్భిణులకు, బిడ్డ తల్లులకు అందించారు.

ఈ సందర్భంగా పిడియాట్రిషన్ పిల్లల వైద్య నిపుణులు?డాక్టర్ .హర్ష మాట్లాడుతూ పుట్టిన ప్రతి శిశువుకు ముప్పై నిమిషాల లోపు ముర్రుపాలు పట్టించడం చాలా అవసరమని, ఇది బిడ్డలో రోగనిరోధక శక్తిని పెంచడానికి మొదటి రక్షాకవచంలా పనిచేస్తుందని స్పష్టం చేశారు. మొదటి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించాలని, నీరు కూడా పట్టకూడదని ఆయన తల్లులకు సూచించారు.అలాగే తల్లిపాలు ఇవ్వడం వల్ల కేవలం బిడ్డకే కాకుండా తల్లికి కూడా రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం నుండి బయటపడతారని వైద్యపరమైన విషయాలను వివరించారు.

కౌన్సిలర్ నారే .వాసు మాట్లాడుతూ తల్లిపాలు త్రాగడం వల్ల పిల్లల మెదడు చురుగ్గా అభివృద్ధి చెందుతుందని, సమాజంలో ఆరోగ్యవంతమైన భావిభారత పౌరులను తీర్చిదిద్దడంలో ప్రతి తల్లి పాత్ర ఎంతో కీలకమని కౌన్సిలర్ వాసు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పలువురు బాలింతలు, గర్భిణీలు, ఆశ వర్కర్లు,మరియు స్థానిక ప్రజలు పాల్గొని అవగాహన సదస్సును విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డాక్టర్స్,స్టాఫ్ ఊహ, సునీత, శాంతి, వినయ్ పాల్గొన్నారు.

## ఈనెల 15 నాటికి భారీ కల్వర్టు పనులు పూర్తి

త్వరలో రోడ్డు విస్తరణ పనులు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 4:**నగర జనాభా తూర్పు రైల్వే స్టేషన్ వైపు విస్తరిస్తోంది. ఈ ప్రాంతంలో ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, విద్యా, వాణిజ్య సంస్థలు విస్తరిస్తున్నాయి. దాంతో ఈ మార్గం విపరీతంగా జనాభా వాహనాలతో రద్దీ పెరిగింది. ఈ క్రమంలో తాటి తోట, వీరభద్రపురం పాత కబేలా వద్ద సుమారు 30 సంవత్సరాల క్రితం నిర్మించిన పాత కల్వర్టు సరిపోకపోవడం, రోడ్డు 40 అడుగులు మాత్రమే ఉండడం వల్ల విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోంది నగర ప్రజలు సతమతమయ్యేవారు. ఈ ప్రాంతంలో పెరిగిన ప్రజల అవసరాలు , తూర్పు రైల్వే స్టేషన్ అభివృద్ధి చెందుతుం డం, గోదావరి పుష్కరాలు రానున్న నేపథ్యంలో తాడితోట తూర్పు రైల్వే స్టేషన్ ప్రధాన రహదారిగా మారింది. దాంతో నగరపాలక సంస్థ సాధారణ నిధులు కోటి రూపాయల వ్యయంతో పాత కబేలా వద్ద 100 అడుగుల వెడల్పుతో మూడు నెలల క్రితం భారీ కల్వర్టునుచేపట్టడం జరిగింది. నాణ్యత ప్రమాణాలతో జరుగుతున్న ఈ పనులు ఈనెల 15 నాటికి పూర్తవుతాయని ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్ తమ్మయి నాయుడు తెలిపారు. రెండు రోజుల్లో ఇప్పటికే మార్కింగ్ చేసిన రోడ్డు విస్తరణ, ఆక్రమణల తొలగింపు పనులను ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. తాడితోట నుంచి తూర్పు రైల్వే స్టేషన్ వరకు సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు చేపట్ట నున్నట్లు తెలిపారు. రోడ్డు మధ్య డివైడర్లతో పాటు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. తూర్పు రైల్వే స్టేషన్ వద్ద విస్తరణ పనులు జరుగుతుండంతో

రైల్వే కు చెందిన ఆర్ఎంఎస్ స్కూలు స్థలాన్ని 80 అడుగుల సీసీ రోడ్డుగా నిర్మించి ఇటీవలనే పూర్తి చేసామని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

# దర్భ గూడెం ఫారెస్ట్ లో పులి



**జీలుగుమిల్లి, పెన్ పవర్, ఆగస్టు 4;** దర్భ గూడెం జామాయిల్ ఫారెస్ట్ లో పులి ఉన్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. మంగళవారం జామాయిల్ అడవు లో డ్రోన్ల ద్వారా పులి దాగి ఉన్నట్లు తెలిపారు. మహారాష్ట్ర, కర్ణాటక ,పూణే నుండి ప్రత్యేక ఆపరేషన్ నిపుణులు దర్ప గూడెం జామాయిల్ ప్లాంటేషన్ లో పులి దాగి ఉన్న ప్రదేశాన్ని గుర్తించారు. అయితే పులి అలసిపోయి బయటకు రాలేక పోతుందని నిపుణులు తెలుపుతున్నారు. పులిని పట్టుకొని జూలో పెట్టడానికి అధికారులు, ప్రత్యేక బృందం కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా డి ఎఫ్ ఓ పీవీ సందీప్ రెడ్డి, సబ్ డీఎఫ్ఓ వెంకటసుబ్బయ్య, జంగారెడ్డిగూడెం రేంజ్ ఆఫీసర్ దుర్గా కుమార్, డిఆర్ఓ ధర్మారావు, సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు

- తెలికిచర్ల గ్రామానికి చెందిన కంకిపాటి రవీంద్రకు రూ.1,52,244 ముఖ్యమంత్రి సహాయనిధి అనుమతి పత్రం మంజూరు





**పెన్ పవర్ -- ద్వారకాతిరుమల, ఆగస్టు 04**
రాజకీయాలకు అతీతంగా మానవత్వమే ముఖ్యమని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు మరోసారి నిరూపించారు. కష్టాల్లో ఉన్న వారికి పార్టీతో సంబంధం లేకుండా అండగా నిలుస్తూ ప్రజానాయకుడిగా తన ప్రత్యేకతను చాటుకున్నారు.

గోపాలపురం నియోజకవర్గంలోని నల్లజర్ల మండలం తెలికిచర్ల గ్రామానికి చెందిన కంకిపాటి రవీంద్ర గతంలో వైఎస్సార్సీపీ వాలంటీర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆయన నడుము వెన్నెముకలో నాలుగో, ఐదో ఎముకల మధ్య ఉన్న డిస్క్ సమస్యతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు వెంటనే స్పందించి బాధితుడికి అవసరమైన వైద్య సహాయం అందేలా చర్యలు చేపట్టారు.

రవీంద్రకు అత్యవసరంగా శస్త్రచికిత్స అవసరం కావడంతో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.1,52,244 విలువైన అనుమతి పత్రాన్ని మంజూరు చేయించారు. ఈ ఆర్థిక సహాయం బాధిత కుటుంబానికి ఎంతో ఊరటనిచ్చింది.

“మనిషికి పార్టీ కాదు... ప్రాణమే ముఖ్యం” అనే భావనతో ప్రతి అవసరమైన కుటుంబానికి అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు సేవలను స్థానిక ప్రజలు ప్రశంసించారు.

ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు మాట్లాడుతూ, రాజకీయాలకు అతీతంగా స్పందించి ప్రజలకు సహాయం చేసే నాయకుడు తమకు ఉండటం అదృష్టమని పేర్కొంటూ ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మండల తెలుగు యువత అధ్యక్షులుగా గుడెల్లి



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, ఆగస్టు 4 ;** మండల తెలుగు యువత అధ్యక్షులుగా గుడెల్లి లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. పోలవరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆదేశాల ప్రకారం నియామకం జరిగినట్లు గుడిల్లి లక్ష్మీనారాయణ తెలిపారు. పి అంకంపాలెం గ్రామానికి చెందిన గుడిల్లి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ టిడిపి అంటే ఎంతో అభిమానం అని మా గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో తన వంతు కృషి చేసినందుకు ప్రతిఫలంగా ఈ పదవి వచ్చినట్లు ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో టిడిపి బలోపేతానికి మరింత కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు .టిడిపి ఇన్చార్జి బొరగం శ్రీనివాస్ కి ఏలూరు జిల్లా టిడిపి అధ్యక్షులు బడేటి రాధాకృష్ణ కి అభినందనలు తెలిపారు.

## పొగాకు రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం



**నేడు రైతులకు మద్దతుగా దేవరపల్లి వస్తున్న వైయస్ జగన్**

**రాజమహేంద్రవరం పెన్ పవర్, ఆగస్టు 4** :రాష్ట్రంలో పొగాకు రైతు లను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫల మైందని, ప్రభుత్వంపై రైతులు తిరుగుబాటు చేసే రోజు దగ్గర పడిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కం పూడి రాజా అన్నారు.

మంగళవారం ఆయన మీడియా సమావేశంలో రాజా మాట్లాడుతూ. రెండేళ్ల కూటమిపాలనలో రైతాంగం అనేక రకాలైన సమస్యలను ఎదుర్కొం టున్నారన్నారు. సకాలంలో ఎరువులు, విత్తనాలు దొరక్క, పండించిన పంట కు గిట్టుబాటు ధరలభించక అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారన్నారు.

రైతన్నలకు ప్రభుత్వం భరోసా కల్పించలేకపో వడం దారణమన్నారు.

రాష్ట్రంలో రైతు సంక్షేమమే లక్ష్యంగా జగన్మోహన్ రెడ్డి పని చేశారన్నారు. . పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఒక్కో బ్యారెన్ కి రూ. 4 లక్షలు నుంచి రూ.5 లక్షల మేరకు నష్టపోవలసిన పరిస్థితిల్లో పొగాకు రైతులు రోడ్డున పడ్డారన్నారు. పొగాకు రైతులకు బాసట గా నిలిచేందుకు ఈనెల 5వ తేదీన వైయస్ జగ న్మోహన్ రెడ్డి దేవరపల్లి విచ్చేస్తు న్నారన్నారు.

కిలో పొగాకుపై రూ.39 వేలు ఆదాయం వస్తే రైతుకి రూ.250 ఇస్తారా ప్రశ్నించారు, కేజీ వర్జీనియా పొగాకుతో 100 సిగరెట్లు పెట్టెలు తయారు చేసే అవకాశం ఉందన్నారు. మార్కెట్ ధరల ప్రకారం రూ.39 వేల ఆదాయం సమకూర్తుందన్నారు. దీనిలో 62.5 శాతం ఆదా యం కేంద్ర ,రాష్ట్ర ప్రభు త్వాలకు జీఎస్టీ, ఎక్సైజ్ డ్యూటీ, ఎన్ సీ సి డీ ల తోపాటు వివిధ రకాల పన్నుల రూపంలో వెళుతుందన్నారు. ఈ కూటమి ప్రభుత్వానికి చలనం రావడం లేదన్నారు.

రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితులను ఈ ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. 80 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి అయితే

కేవలం 12 మిలియన్ కిలోలు మాత్ర మే కొనుగోలు చేయడం తో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారన్నారు.

రైతుల పక్షాన నిలబడాల్సిన ప్రభుత్వం కొనుగోలు కంపెనీలకు వత్తాసు పలుకుతుందని విమర్శించారు. కనీసం పొగాకును నిల్వ చేసుకు నేందుకు గోడౌన్ల సదు పాయం లేకపోవడంతో రవాణా ఖర్చుల రూపం లోనూ రైతులపై భారం పడుతుందన్నారు

## విచ్చలవిడిగా నిర్వహిస్తున్న జూదరులపై పోలీసులు దాడులు

**సీతానగరం, పెన్ పవర్, ఆగస్టు:04:**సీతానగరం మండలంలోని చినకొండేపూడి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల భవనం వెనుక గత కొంత కాలంగా విచ్చలవిడిగా నిర్వహిస్తున్న జూదం పై సీతానగరం ఎస్సై ఎల్. శ్రీను నాయక్ మంగళవారం సాయంత్రం దాడులు చేశారు. అధికార పార్టీకి చెందిన నేత కావడంతో ఇప్పుడు వరకు ఆ పేకాట శిబిరానికి వెళ్లటానికి పోలీసులు కొంత వెనకడుగు వేశారు. ఈ దాడుల్లో ఐదుగురిని అరెస్టు చేసి 2500 నగదును స్వాధీనం చేసుకొని జూదరులపై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా వంగలపూడి గ్రామంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నగదు రూ.9360 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. మండలంలోని పేకాట గుండాట కోడిపందాలు అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

## వరద బాధితులకు అండగా జనసేన

కూటమి ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ





**చింతూరు, పెన్ పవర్, పెన్ పవర్, ఆగస్టు 4:**భారీ వర్షాలు, వరదల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న గిరిజన గ్రామాల ప్రజలకు అండగా జనసేన పార్టీ నాయకులు ముందుకు వచ్చారు. చింతూరు మండలంలోని ముకునూరు, రమణపల్లెం, పెద్దసీతానపల్లి పంచాయతీల పరిధిలోని వరద ప్రభావిత గ్రామాలు, ముఖ్యంగా బొడ్రాయిగూడెం, రమణపాలెంలో జనసేన ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరదలతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను పరామర్శించిన నాయకులు వారికి వంట నూనె, కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు తదితర నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ప్రజలకు అవసరమైన సహాయ కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని, ఆపద సమయంలో ప్రజలకు అండగా నిలవడం జనసేన పార్టీ బాధ్యతగా భావిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తీగల కవిత, తీగల రవి, పొడియం నాగార్జున పాల్గొని వరద బాధితులకు ధైర్యం చెప్పారు. కూటమి భాగస్వామ్యంగా తెలుగుదేశం పార్టీ మండల నాయకుడు ఎస్.కే. జాఫర్ కూడా పాల్గొని సహాయక కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యారు. అలాగే పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో మోహన్, వెల్ఫేర్ అసిస్టెంట్ రాము కార్యక్రమంలో పాల్గొని సహాయ పంపిణీని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం కష్టకాలంలో ప్రతి కుటుంబానికి అండగా ఉంటుందని, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని గ్రామస్తులకు భరోసా కల్పించారు. వరద బాధితులకు అండగా నిలిచి సహాయక కార్యక్రమాన్ని నిర్వహించిన జనసేన నాయకులు తీగల కవిత, తీగల రవి, పొడియం నాగార్జున, అలాగే కూటమి నాయకుడు ఎస్.కే. జాఫర్ సేవలను స్థానిక గ్రామస్తులు అభినందించారు.

# దేవతామూర్తుల విగ్రహాల ధ్వంసం





**సీతానగరం, పెన్ పవర్, ఆగస్టు:04** సీతానగరం మండలంలోని రఘుదేవపురంలో గ్రామంలో దేవతామూర్తుల విగ్రహాలను ధ్వంసం చేయడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోట దుర్గమ్మ దేవాలయం ఎదురుగా కనకమహాలక్ష్మి అమ్మవారి విగ్రహం తలభాగాన్ని విరిచేశారు. పరిసర ప్రాంతాల్లోనే ఆంజనేయస్వామి విగ్రహాన్ని రాళ్లతో కొట్టి నిందితులు ధ్వంసం చేశారు. మంగళవారం తెల్లవారుజామున పూజలు నిర్వహించేందుకు భక్తులు వెళ్ళగా విగ్రహాలు ధ్వంసం చేసి ఉండటంపై దేవాలయ కమిటీ నిర్వాహకులకు సమాచారాన్ని అందించారు. ఆలయ కమిటీ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీతానగరం ఎస్సై ఎల్ శ్రీను నాయక్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను ఎస్సై నాయకులు పరిశీలిస్తున్నారు. ఈ ఘటనలకు పాల్పడిన నిందితులను పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

# తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ కవచం

ర్యాలిలో తల్లిపాల వారోత్సవం నిర్వహణ



**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 4:** ర్యాలి గ్రామంలోని 11వ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారి ఏ. గజలక్ష్మి ఆదేశాల తో సెక్టార్ సూపర్‌వైజర్ వై. అరుంధతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారుల తల్లులకు తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.

జననం తర్వాత తొలి గంటలోనే శిశువుకు తల్లిపాలు అందించడం, తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల చిన్నారుల్లో రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడుతుందని అధికారులు వివరించారు. తల్లి ఆరోగ్య పరిరక్షణలోనూ తల్లిపాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త నాగమణి, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రైతుల విధిగా పంటల బీమా నమోదు చేయించుకోవాలి.

-మండల వ్యవసాయశాఖ అధికారిణి నాగం సుధామాధురి




**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు, 04:** రైతులు విధిగా పంట బీమా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి నాగం సుధామాధురి పిలుపునిచ్చారు మంగళవారం కిర్లంపూడి మండలం గోనేడ ,కృష్ణవరం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ' పొలం పిలుస్తుంది 'కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారిణి నాగం సుధామాధురి 'ప్రధానమంత్రి పసలీ బీమా యోజన పై రైతులకు అవగాహన కల్పించారు .

ప్రస్తుతం 'ఎల్ నినో' ప్రభావం కొనసాగుతున్నందున ప్రతి రైతు పంటల భీమా పథకంలో చేరాలన్నారు. బ్యాంకులో 'పంట రుణం పొందని రైతులు సి ఎస్ సి సెంటర్ ద్వారా ప్రీమియం చెల్లించవచ్చన్నారు.మన జిల్లాలో వరి పంటకు ఎకరానికి. రూ. 760/ ప్రీమియం చెల్లించి ఈ నెల 15 తారీకు లోపు ఈ పథకంలో చేరాలని సూచించారు.

రైతులు కావలసిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ ద్వారా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కాంప్లెక్స్ ఎరువులను నాట్లు వేసిన 15 రోజులు తర్వాత వాడరాదని సూచించారు.

ఈ కార్యక్రమంలో గోనేడ ఎంపిటిసి అల్లు శివరామకృష్ణ, జగ్గంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోదిరెడ్ల సుబ్బారావు ,ఏఈఓ ఎన్. సీతారామమూర్తి , వి.ఏ.ఏ లు అహ్మద్ వల్లి ,లింగేశ్వర్, పలువురు అభ్యుదయ రైతులు పాల్గొన్నారు

## ప్రజల వద్దకే కూటమి ప్రభుత్వం 2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి-సంక్షేమం



**అంబాజీపేట, పెన్ పవర్, ఆగష్టు 04:** భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్య శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ బాబు గ నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం కూటమి ప్రభుత్వం లో జరుగుతుందని పి గన్నవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కో కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ అన్నారు. కె. పెదపూడి గ్రామంలో గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు ప్రతి ఇంటింటికి వెళ్లి గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం సాధించిన అభివృద్ధి అందిస్తున్న సంక్షేమం పాలాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ. వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

నాయకుల పై ప్రజల్లో ఉన్న నమ్మకమే ఈ ప్రభుత్వానికి కొండంత బలమని ఆయన పేర్కొన్నారు.... ఈ ఇంటింటి కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర తెలుగుదేశం పార్టీ యస్ సి సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి పెదపూడి శ్రీనివాసరావు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తిరుమనాదం వీర హనుమంతరావు, పార్టీ సీనియర్ నాయకులు నాగాబత్తుల వెంకట సుబ్బారావు. కత్తుల బాబులు, గుంటూరీ మురళీకృష్ణంరాజు . పుల్లేటికుర్రు సొసైటీ సభ్యులు పేచ్చేటి హరిబాబు, చిక్కంపల్లం రాజు. నేదునూరి పెద్దిరాజు. మంద రాజేష్. మోకా శ్రీనివాస్. సిరా నాగరాజు. నేదునూరు వెంకటేశ్వరరావు. తదితరులు ఇంటింటి ప్రచారం కార్యక్రమం లో పాల్గొన్నారు

# వరదబాధితులందరికీ న్యాయంచేయాలి.

**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.4**

మండలంలోని కొత్తూరు,చొక్కనపల్లి,తదితరగ్రామాల్లో ఉన్న వరదభాదితులను ఏఅధికారులుకూడా వచ్చి, పరామర్శించించినది,లేదని,వరదభాదితులు ఆరోపిస్తు న్నారు. చొక్కనపల్లి,కొత్తూరు,గ్రామానికిచెందిన,సున్నం సీతమ్మఅందెలనాగమణి,కెచ్చెలరతమ్మ,కేచ్చేలమహాలక్ష్మి, భీమిరెడ్డి కేచ్చేలసీతారత్నం,కేచ్చేలమోహన్ రెడ్డి,ఎస్. నాగేంద్ర రెడ్డి,గృహాలు పూర్తిగానీటీలోమునిగిన్నాయని, మమ్మల్నిప్రభుత్వంఅన్నివిధాలుగాఆదుకోవాలని,కోరారు కొత్తూరు,చొక్కనపల్లి,తదితర గ్రామాలకు నిత్యవసర సరుకులు,ప్రభుత్వంఅందించే,నగదుఆర్ధికసహాయం వరదబాధితులుఅందరకీఅందుతుందా?లేదో,తగు సమాచారంతెలియకపోవడంతోఆందోళనలోపడ్డారు. మండలానికి రావాలంటే,రహదారులు దిగ్బందం, కావడంతోపనులులేకనానాఇబ్బందులుపడుతున్నా మని,వరదభాదితులుఆరోపిస్తున్నారు.ఇకనైనావరద భాదితులందరికీ,న్యాయంచేయాలని,సంబంధితఅది కారులనుకోరారు.



## భక్తుల రద్దీకి చెక్.. వాడపల్లిలో మాడవీధుల విస్తరణకు అధికారుల కసరత్తు







**గ్రామస్థులతో అధికారుల సమావేశం........**

**సహకారం అందించాలని విజ్ఞప్తి**

**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 4:**

కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన శ్రీ వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి రోజురోజుకు పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మాడవీధుల విస్తరణకు అధికారులు కార్యాచరణ ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ ఆదేశాల తో మంగళవారం ఆలయ ఉప కమిషనర్ కార్యాలయంలో గ్రామస్థులతో సమావేశం నిర్వహించి, విస్తరణ అవసరాన్ని వివరించారు.

సమావేశంలో కొత్తపేట ఆర్డీవో జి.వి. సత్యనారాయణ, దేవాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ వేంద్ర త్రినాథ్ రావు, ఆత్రేయపురం తహసీల్దార్ రామచంద్రమూర్తి, ఆలయ ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధర రావు, ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, వాడపల్లి క్షేత్రానికి నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో పండుగలు, ప్రత్యేక ఉత్సవాల సమయంలో రద్దీ మరింత పెరుగుతోందని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా దర్శనం, ఊరేగింపులు, రథోత్సవాలు సాఫీగా జరిగేందుకు మాడవీధుల విస్తరణ అత్యంత అవసరమని వివరించారు.

ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాలే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, విస్తరణ పనులకు గ్రామస్థులు సహకరించి ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అధికారులు కోరారు. గ్రామస్థుల అభిప్రాయాలను కూడా అధికారులు తెలుసుకుని, వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. పరస్పర సహకారంతో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

## గీత కులాలకు ప్రత్యేక సంక్షేమ పథకం అమలు చేయాలి



**కొత్తపేట,పెన్ పవర్,ఆగస్టు 4:** గీత కులాల ఆర్థికాభివృద్ధి కోసం అమలులో ఉన్న 10 శాతం మద్యం దుకాణాల కేటాయింపు విధానాన్ని పునఃసమీక్షించాలని, మత్స్యకార భరోసా, నేతన్న నేస్తం తరహాలో ప్రతి అర్హ గీత కుటుంబానికి ప్రత్యక్ష ఆర్థిక సాయం అందించే ప్రత్యేక సంక్షేమ పథకాన్ని అమలు చేయాలని కొత్తపేటకు చెందిన మాజీ టీడీపీ శెట్టి బలిజ సాధికారిత డైరెక్టర్ బొక్కా ప్రసాద్ కోరారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

యువగళం పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం గీత కులాలకు 10 శాతం మద్యం దుకాణాల రిజర్వేషన్ కల్పించడం స్వాగతించదగ్గ నిర్ణయమేనని, అయితే ప్రస్తుతం ప్రతి నియోజకవర్గంలో ఒకటి లేదా రెండు దుకాణాలు మాత్రమే కేటాయించడంతో కొద్దిమందికే ప్రయోజనం చేకూరుతోందని బొక్కా ప్రసాద్ పేర్కొన్నారు. వేలాది గీత కుటుంబాలు, నిరుద్యోగ యువతకు ఈ విధానం ద్వారా ప్రత్యక్ష లబ్ధి అందడం లేదన్నారు. గీత కులాలకు కేటాయించిన మద్యం దుకాణాల్లోనూ అదే వర్గానికి చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యం కల్పించాలని కోరారు. గీత కులాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి అర్హ కుటుంబానికి నేరుగా ఆర్థిక లబ్ధి చేకూరేలా ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టాలని, ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్‌ను విజ్ఞప్తి చేశారు.

## అపరాలు, చిరుధాన్యాల పంట సాగు చేయాలి



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 4:** మండలంలోని జగ్గంపేట, కాట్రావులపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు ఏఎస్ఆర్ శర్మ, వి.సుజాత, ఎ.భవాని ప్రసాద్, జగ్గంపేట సహాయ వ్యవసాయ సంచాలకులు జి. శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావం ఉన్నందున స్వల్పకాలిక రకాలు మాత్రమే వాడుకోవాలని అనగా ఆపరాలు, చిరుధాన్యాలు, కూరగాయలు వేసుకోవాలని సూచించారు. అంతేకాక స్వర్ణ రకంతో పాటుగా వాడుతున్న ఎం టి యు 13 18 రకానికి ఒకే రకమైన ఎరువులు వాడాలని అంతకుమించి ఎక్కువ వాడినట్లయితే పంటకాలం పెరిగే అవకాశం ఉందని ముందుగా సిఫారసు మేరకే ఎరువులు వేసుకోవాలన్నారు. అలాగే సమగ్ర సస్యరక్షణ సమగ్ర ఎరువులు యాజమాన్యం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్ నరసింహం, ఏఈఓ పి.చంద్రమౌళి, గ్రామ వ్యవసాయ సహాయకులు శ్యామ్, పృధ్వి, సారిక తేజస్విని, రైతులు పాల్గొన్నారు.

# ఎస్సీ బాయ్స్ హాస్టల్ భవనాన్ని నిర్మించండి

**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 4:** జగ్గంపేట ఎస్సీ బాయ్స్ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరి రెండేళ్లు గడుస్తున్న ప్రభుత్వం కొత్త భవన నిర్మాణానికి ముందుకు రావడం లేదని బహుజన సమాజ్ పార్టీ కాకినాడ జిల్లా అడ్వైజర్ జుత్తుక నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు అనుకూలంగా లేకపోవడంతో రెండు సంవత్సరాల క్రితం తాత్కాలికంగా వేరే ప్రాంతానికి మార్చారు. పాత హాస్టల్ స్థలం విద్యార్థులకు సౌకర్యవంతమైన ప్రాంతంలో ఉండటంతో పాటు ప్రభుత్వానికి ఇప్పటికే అందుబాటులో ఉన్న స్థలం కావడం వల్ల అక్కడే కొత్త భవనం నిర్మిస్తే విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించవచ్చని ఆయన తెలిపారు. జగ్గంపేట ఎస్సీ బాయ్స్ హాస్టల్ నిర్మాణానికి నిధులు మంజూరు అయినా సరే హాస్టల్ నిర్మాణానికి కాలయాపన చేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం పాత హాస్టల్ ఉన్న స్థలంలో కాకుండా వేరే స్థలంలో నిర్మించడానికి కూటమి ప్రభుత్వ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. జగ్గంపేట నడిబొడ్డున దళితుల పిల్లలు ఉండకూడదనే దురుద్దేశంతో ఈ ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పాత హాస్టల్ స్థలంలోనే ఆధునిక సౌకర్యాలతో నూతన భవన నిర్మాణాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులను ఆయన కోరారు.

